# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట


## నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు : జిల్లా కలెక్టర్



పోస్టర్‌ను ఆవిష్కరణ చేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల జనవరి 29 ప్రభాతవార్త :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. బుధవారం ఐ.డి.ఓ.సిలోని తమ ఛాంబర్ నందు ఎం.ఏ.ఎల్.డీ. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ జాబ్ డ్రైవ్ గోడపత్రికను జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని సూచిస్తూ, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యూలాండ్ లాబొరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో నేడు ఉదయం 9:30 గంటలకు ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వర్చ్యువల్ క్లాస్ రూమ్ లో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. ఈ జాబ్ మేళాలో 18 నుండి 23 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు ఇంటర్మీడియట్ ఎంపీసీ బైపీసీ 5, 2022, 2023, 2024 డిగ్రీ ఉత్తీర్ణత లేదా ఫెయిల్, 2021, 2022, 2023, 2024 బీసీ.కెమి 2025 ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా అర్హులు అని తెలిపారు. అభ్యర్థులకు తెలుగు భాషలో ప్రావీణ్యం, ఇంగ్లీష్‌పై ప్రాథమిక అవగాహన అవసరమని అన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం రూ.2,00,000/- ఉంటుందని, అదనంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉన్నత విద్యకు ప్రత్యేక సహాయం, ఉచిత రవాణా సౌకర్యం, సబ్సిడీ క్యాంటీన్ భోజనం, రాత్రి షిఫ్ట్ అలవెన్స్ వంటి ప్రయోజనాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హతలు కలిగిన ప్రతి అభ్యర్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు ,కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కాలందర్ భాషా, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రాధిక, కళాశాల టీఎస్‌కేసీ సమన్వయకర్త సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా : జిల్లా కలెక్టర్



అధికారులతో వెబ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్ జనవరి 29 ప్రభాతవార్త :** రైతు భరోసా సర్వే సందర్భంగా వనపర్తి జిల్లాలో గుర్తించిన వ్యవసాయేతర భూమిని ఆన్లైన్ లో నిక్షిప్తం చేసి ఫ్రీజ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి తహశీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులతో వెబ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేసే ప్రక్రియ ప్రారంభమైందని, అర్హులైన ప్రతి రైతుకూ రైతు భరోసా అందేవిధంగా చూడాలన్నారు. రైతు భూమిలోని కొంత భాగం వ్యవసాయం చేస్తూ మరికొంత భాగం వ్యవసాయేతర భూమిగా మార్చిన వాటిని విడదీసి వ్యవసాయ యోగ్యం ఉన్న భూమికి రైతు భరోసా పడాల్సి ఉంటుందన్నారు. దీనికొరకు ఎంత భూమి వ్యవసాయేతర భూమి ఉందో దానిని మాత్రమే ఆన్లైన్ లో ఫ్రీజ్ చేయాల్సి ఉంటుందని వివరించారు. తహశీల్దార్లు, వ్యవసాయ అధికారులు కూర్చొని సమన్వయంతో ఫ్రీజింగ్ ప్రక్రియ సాయంత్రం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రేషన్ కార్డుల విషయంలో ఏదైతే కొత్త దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చాయో వాటిని క్షుణ్ణంగా పరిశీలించి రేషన్ కార్డుకు అర్హులైన జాబితాను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, తహశీల్దార్ మదన్ మోహన్, అందరూ తహశీల్దార్లు, మండల వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ వీఎంల రూం వద్ద భద్రత పటిష్టంగా ఉండాలి

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్**



స్ట్రాంగ్ రూమ్‌ను, ఈవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

**గద్వాల జనవరి29 ప్రభాతవార్త:**ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం)లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లాకలెక్టర్ సంతోష్ బుధవారం సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనఖిలో భాగంగా కలెక్టర్ ఈ తనిఖీ నిర్వహించారు. గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తో పాటు భద్రత నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గద్వాల తహశీల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, సురేష్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యంగా వాహనాలు నడపరాదు

- కలెక్టర్ విజయేంద్ర బోయి
- రోడ్డు నియమ నిబంధనలు పాటించాలి: ఎస్పీ జానకి
- రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బైక్ ర్యాలీ




బైక్ ర్యాలీలో పాల్గొన్న పోలీస్ అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 29 ప్రభాత వార్త:** నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్లనే ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అందరూ హెల్మెట్, సీటుబెల్ట్ ధరించడం అలవాటు చేసుకోవాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి సూచించారు. జిల్లాలో రోడ్డు భద్రత మాసోత్సవాల (రోడ్ సేఫ్టీ మంత్ సెలబ్రేషన్స్) సందర్భంగా, జిల్లా ఎస్పీ డి.జానకి ఆధ్వర్యంలో 200 మంది పోలీసు సిబ్బందితో భారీ బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డిఎల్ఎస్ఎ) సెక్రటరీ ఇందిరా దేవి, విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. మొదటగా ట్రాఫిక్ నిబంధనలు కలిగిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ "రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరం అని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సం స్థసెక్రటరీ ఇందిరా దేవి మాట్లాడుతూ, "రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజలు, అధికార యంత్రాంగం కలిసి పనిచే యాలి. ట్రాఫిక్‌నిబంధనలను కఠినంగా అమలు చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చు" అని అన్నారు. జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ "ఈ బైక్ ర్యాలీ యువతకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడం,రోడ్‌భద్రత యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడం లక్ష్యంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అనివార్యం అన్నారు. ప్రమాదాలను నివారించేందుకు, బాధ్యతాయుతమైన రైడింగ్ అలవర్చుకోవాలన్నారు. అనతరం జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ క్లాక్ టవర్, అశోక్ థియేటర్ ఎక్స్‌రోడ్, న్యూ బస్టాండ్, న్యూ టౌన్, మెట్టుగడ్డ నుండి యూటర్న్ తీసుకొని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వరకు సాగింది. ఈ బైక్ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పోలీసులు పాల్గొని, ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్పి రాములు, ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ ఎం.కిషన్, ట్రాఫిక్ డిఎస్‌పి సుదర్శన్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ భగవంత్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్‌పెక్టర్ అప్పయ్య, ఉమెన్ పి.ఎస్ ఇన్స్పెక్టర్, శ్రీనివాసులు, ఎం.వి.ఐ/డి.టి.ఒ, రఘు కుమార్, ఆర్.ఐ లు కృష్ణయ్య, రవి ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

## సీఎం దృష్టికి తీసుకెళ్తాం..

**పెద్ద ధన్వాడ సమీపంలో ఇథనాల్ ఫ్యాక్టరీని రాకుండా చూస్తాం..**

**12 గ్రామాల ప్రజలకు అండగా ఉంటాం**

**దీక్షకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు**



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి,చిత్రంలో ఎమ్మెల్యే విజయుడు

**ఇటిక్యాల, జనవరి 29 ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గం రాజోలి మండలం, పెద్ద ధన్వాడ గ్రామం సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫార్మసీ కంపెనీని ఏర్పాటు చేయకుండా అనుమతులు రద్దు చేసేందుకు మరోసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్సీ చెల్లా వెంకట్రామిరెడ్డి,ఎమ్మెల్యే విజయ్యుడు భరోసానిచ్చారు.కంపెనీని వ్యతిరేకిస్తూ 7రోజులుగా ఆయాగ్రామాల ప్రజలు రిలే నిరాహారదీక్షలు నిర్వహిస్తుండగా బుధవారం ఎమ్మెల్సీ,ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అల్లంపూర్ నియోజకవర్గంలో ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల పంట పొలాలు నాశనమవుతాయని అలాగే ప్రజలు కూడా అనారోగ్యానికి గురవుతారని ప్రజల జీవనానికి ఇబ్బందులు ఏర్పడతాయని ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కంపెనీ పచ్చని పంట పొలాలలో ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తూ పంటపొలాలను నాశనం చేసేందుకు అలాగే ప్రజల జీవనాధారం అయిన పొలాలను పనికి రాకుండా చేసేందుకు ప్రభుత్వం ఫ్యాక్టరీకి అనుమతులు ఇచ్చిందని ప్రజలు చేస్తున్న ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని వెంటనే అనుమతులను రద్దుచేసి ప్రజలకు న్యాయం జరగాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ పరంగా ప్రజల పక్షాన ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. 12 గ్రామాల ప్రజలకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని 12 గ్రామాల ప్రజల రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు.

## చౌకబారు రాజకీయాలు మానుకోవాలి

**- గువ్వల కాదు గుంతల బాలరాజు - విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త:**చౌకబారు రాజకీయాలు మానుకోవాలని, కుల రాజకీయాలు తగవని దళితుల గురించి మాట్లాడే నైతిక హక్కు గువ్వల బాలరాజుకు లేదని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ ఎమ్మెల్యే కుచుకుళ్ల రాజశేఖర్‌రెడ్డి తో కలిసి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ గువ్వల బాలరాజు ఓటమిని జీర్ణించుకోలేకనే మతిస్థిమితం కూలిపోయి కాంగ్రెస్ ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అచ్చంపేట ప్రజలు రెండు సార్లు ఎమ్మెల్యేగా అవకాశమిస్తే అచ్చంపేటను లూటీ చేశారని, ఎక్కడెక్కడ భూములు ఆక్రమించాడు అన్ని సాక్షాలు లెక్కలు ఉన్నాయని, నల్లమల్ల అడవి ప్రాంతంలో నిధుల కోసం తవ్వకాలు చేశావు నీ నిజ స్వరూపం బయటపెట్టి కటకటాల్లోకి పంపుతానని హెచ్చరించారు. అచ్చంపేట ప్రజలు గువ్వల బాలరాజుని ముద్దుగా రౌడీ, గుంతల బాలరాజు అని పిలుచుకుంటారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే స్థాయి నీది కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలకు గాను ఐదు గ్యారెంటీలను విజయవంతంగా అమలవుతున్నాయని నీ కనులకు కనిపించడం లేదా పసిరికలు వచ్చినట్లు ఉన్నాయి ఒక డాక్టర్‌గా సలహా ఇస్తున్నానని మంచి హాస్పిటల్‌లో వైద్యం చేయించుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఎక్కడ సభలు నిర్వహించిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలోనే 61 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదని అన్నారు. 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో 20 సంవత్సరాలు రాష్ట్రం వెనక్కి పోయిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పోలీసులను, అధికార బలాన్ని పెంచుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమ కేసులు పెట్టి రౌడీ బాలరాజుగా పేరు తెచ్చుకున్నావని అన్నారు. రాజకీయాన్ని వ్యాపారం చేశావని సొంత కార్యకర్తల దగ్గర ఒక్కో పోస్టుకు 30 లక్షల నుండి 60 లక్షల రూపాయల వరకు 26 కోట్ల రూపాయలను దోచుకున్న దొంగ గువ్వల బాలరాజ్ అని, కరోనా సమయంలో ఐదు కోట్ల రూపాయలను దోచుకున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దమ్ము ధైర్యం ఉంటే అచ్చంపేట అంబేద్కర్ చౌరస్తా కి రావాలని ఎక్కడెక్కడ భూములు ఆక్రమించావు, ఎవరి దగ్గర ఎన్ని డబ్బులు వసూలు చేశావు అన్ని ఆధారాలు ఉన్నాయని, బహిరంగ చర్చకు సిద్ధమని గువ్వలను హెచ్చరించారు. ఇంకొకసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడితే అచ్చంపేట ప్రజలే మీకు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్ కుమార్, క్రాంతి కుమార్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారం ఎవరి జాగీర్ కాదు..

## ఎవరి ఇంట్లోంచి తెచ్చింది కాదు

- కాంగ్రెస్‌పై బురదజల్లే ప్రయత్నాలు బీఆర్ఎస్ మానుకోవాలి
- భూత్పూర్ మున్సిపాలిటీలో అవకతవకలపై విచారణ జరిపిస్తాం
- భూత్పూర్‌లో మీడియా సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్)

**భూత్పూర్,జనవరి 29,ప్రభాతవార్త :** తాము చేసిన పనులకు కాంగ్రెస్ నాయకులు ప్రారంభోత్సవాలు చేస్తూ క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకుంటున్నారని ఇటీవల బీఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు గొప్పలు చెబుతూ,ప్రగల్భాలు పలుకుతున్నారని అధికారం ఎవరయ్య జాగీర్‌కాదని, అది ఎవరి ఇంటి నుంచి విచ్చింది,తెచ్చింది కాదని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు,ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌పై ఇంకిత జ్ఞానం లేకుండా విమర్శలు గుప్పించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ వేలకోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిందని విమర్శించారు.ఏడాది పాలనపై విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్‌నాయకులు వారు పదేళ్లకాలంలో చేసింది శూన్యమన్నారు.బుధవారం భూత్పూర్ మున్సిపాలిటీ వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే జీఎంఆర్ అనంతరం ఏర్పాటైన మీడియాసమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు భూత్పూర్ మున్సిపాలిటీని ఉద్ధరించినట్లు మాట్లాడుతూ అభివృద్ధికి కాంగ్రెస్‌ప్రభుత్వం అడ్డుపడుతుందని తప్పుడు ఆరోపణలుచేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పాలక పక్షంలో ఉండి ప్రతిపక్ష పాత్ర పోషించిన ఘనత భూత్పూర్ మున్సిపాలిటీకే దక్కిందని ఎద్దేవా చేశారు.పనుల విషయంలో జాప్యం జరుగుతోందని ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లే ధర్నా చేయడం,నిరసనలు తెల్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. నాలుగేళ్ల పాలనలో మున్సిపాలిటీలో ఖర్చు చేసిన నిధుల లెక్కలే లేవని,స్టాంప్ డ్యూటీ నిధుల లెక్కలు చూపించలేదన్నారు.భూత్పూర్ మున్సి పాలిటీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపిస్తాం మున్సిపాలిటీలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.మున్సిపాలిటీకి సొంత

## విజ్ఞాన శాస్త్రాన్ని ఆచరణాత్మక విధానంలో బోధించాలి



విద్యార్థుల ప్రయోగాలను తిలకిస్తున్న జిల్లా కలెక్టర్



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు ఇస్తున్న దృశ్యం

**వనపర్తి టౌన్ జనవరి 29 ప్రభాతవార్త :** విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రాన్ని ఆచరణాత్మక విధానం ద్వారా బోధిస్తే సులువుగా పట్టు సాధిస్తారని, బాగా గుర్తు ఉండిపోతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రత్యేక నిధులతో కొనుగోలు చేసిన 116 సైన్స్ ఫెయిర్ కిట్లను ప్రభుత్వ పాఠశాలలకు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఇండియా లిట్రసి ప్రోగ్రాం ద్వార రూపొందించిన సైన్స్ ఫెయిర్ కిట్లను రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారు 83 ప్రభుత్వ పాఠశాలలకు 244యూనిట్లు అందించి ఉండగా మిగిలిన పాఠశాలలకు రూ.6.57లక్షల వ్యయంతో కలెక్టర్ ప్రత్యేక నిధులతో కొనుగోలుచేసి పంపిణీ చేశారు. సైన్స్‌ఫెయిర్ కోట్లను ఏవిధంగా ఉపయోగించుకోవాలో తెలిపేందుకు ఇండియా లిట్రసిప్రోగ్రాం వారు సైన్స్ టీచర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం సైతం నిర్వ హించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు వైజ్ఞానిక శాస్త్రం, గణిత శాస్త్రం అంటే భయం ఉంటుందని, చాలామంది విద్యార్థులు ఇవే సబ్జెక్టులో ఫెయిల్ అవుతుంటారని గుర్తు చేశారు. వైజ్ఞానిక శాస్త్రంలోని పాఠ్యాంశాలను ఆచరణాత్మక విధానంలో చూపిస్తూ బోధిస్తే సులువుగా అర్థం చేసుకోవడమే కాకుండా ఎప్పటికీ మరచిపోరని తెలిపారు. తద్వారా చక్కటి ఫలితాలు సాధిస్తారని చెప్పారు. విద్యార్థులకు వచ్చే అనుమానాలు, తెలుసుకోవాలనే ఉత్సుకతను ఉపాధ్యాయులు నివృత్తి చేయాలి తప్ప వారిని అణిచివేయవద్దని సూచించారు.ప్రతి సైన్స్ ఉపాధ్యాయుడు వీటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు ప్రయోగాత్మక విధానంలో బోధించడం ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వనపర్తి జిల్లా నుండి పదుల సంఖ్యలో విద్యార్థులకు ప్రయోజనం చేకూరినా అది దేశానికి గొప్ప సంపద అవుతుందని చెప్పారు. వైజ్ఞానిక శాస్త్ర దృక్పథం పెంపొందించాలని రాజ్యాంగంలోని ప్రాదేశిక సూత్రాల్లోనే ఉందని గుర్తు చేశారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ జిల్లాలో విద్యాశాఖను బలోపేతం చేయడం కోసం ఎంతో కృషి చేస్తున్నారని ఇటీవల కేజీబీవీలో కోడింగ్ క్లాసెస్, ఇంటర్మీడియట్ విద్యార్థులను ఐ.ఐ.టి కళాశాలకు తీసుకువెళ్ళి చూపించడం ఆయన ఆధ్వర్యంలోనే జరిగిందన్నారు. అదేవిధంగా వనపర్తి జిల్లాలో గత 35 సంవత్సరాలుగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలు ప్రశంసానీయమని ఆర్డీఎస్ చిన్నమ్మ థామస్‌ను కొనియాడారు.

**అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...**

జిల్లాలో విద్యారంగాన్ని అభివృద్ధి చేయడం కోసం కలెక్టర్ తీవ్రమైన కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పాఠశాలలకు అందజేస్తున్న ఈ సైన్స్ కిట్లను సక్రమంగా వినియోగించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. ప్రాక్టికల్ విధానంలో విద్యాబోధన అనేది మంచి ఫలితాలను అందిస్తుందని చెప్పారు. ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్ మాట్లాడుతూ... జిల్లాలో 35 సంవత్సరాలుగా తమ ఎన్జీవో సేవలందిస్తుందని చెప్పారు. ఇండియా లిట్రసి ప్రోగ్రాం ద్వారా ఈ సైన్స్ కిట్లను జిల్లాకు పరిచయం చేశామని చెప్పారు. భవిష్యత్తులోనూ జిల్లా అభివృద్ధికి తమ సహకారం ఉంటుందని చెప్పారు. ఆర్డీఎస్ తరఫున ఇద్దరు అనాథ విద్యార్థినులకు లక్ష రూపాయల స్కాలర్షిప్ చెక్కును అందజేశారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తున్నందుకు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ తరఫున జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా సైన్స్ అధికారికి మెమెంటో లు అందజేశారు. ఇదే కార్యక్రమంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో, కే.జి.బి.విలో పదో తరగతి, ఇంటర్మీడియట్ లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ ప్రశంసా పత్రాలు, మెమోటోలను అందించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రోడ్డు భద్రతపై నిర్వహించిన డ్రాయింగ్, క్విజ్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సైతం ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం కలెక్టర్ సైన్స్ కిట్ల ద్వారా విద్యార్థులు చేసిన ప్రయోగాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సంతకం ఫోర్జరీ..!

**నకిలీ సంతకంతో లెటర్ ప్యాడ్**

**ఎమ్మెల్యే ఫిర్యాదుతో వెలుగులోకి**

**నిందితులు రిమాండ్‌కి**



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

**నారాయణపేట్ టౌన్, జనవరి 29 ప్రభాతవార్త:**నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి నకిలీ లెటర్ ప్యాడ్ తయారుచేసి దానిమీద ఎమ్మెల్యే సంతకాన్ని ఫోర్జరీ చేసి మరికల్‌లోని కోటకొండ గురుకుల పాఠశాలలో వాచ్ ఉమెన్ పోస్ట్ కోసం ఉపయోగించిన ఐదుగురు వ్యక్తులు కట కటాల పాలయ్యారు.

**వివరాల్లోకి వెళ్తే...** నర్వ మండలం పెద్దకడమూరుకు చెందిన సాకలి శైలేష్ అనే వ్యక్తి గతం లో బీసీ గురుకుల పాఠశాలలో 2017 నుండి 24 మార్చి వరకు అతిధి హిందీ అధ్యాపకుడిగా పని చేసాడు. అట్టి సమయంలో అతనికి గురుకులాలకు సంబంధించిన అధికారులతో కొంత సాన్నిహిత్యం ఏర్పడింది. దాన్ని ఆసరాగా చేసుకున్న నిందితుడు అనేకమందికి గురుకులాలో సీట్లు ఇప్పిస్తానని, ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికేవాడు.ఆక్రమంలో ప్రస్తుతం మరికల్‌లో ఉన్న కోటకొండ బీసీ గురుకుల పాఠశాల వాచ్మెన్ పోస్ట్ గురించి పైరవీ చేస్తానని అక్కడే స్వీపర్ గా పని చేస్తున్న తన వరుసకు మరదలు అయ్యే జ్యోతి అప్పటికే వాచ్‌ఉమెన్‌గా పనిచేస్తున్న సత్యమ్మకు తెలుపగా అందుకు ఇద్దరు కలిసి శైలేష్ ను సంప్రదించారు. ఒప్పుకొన్న శైలేష్ పనిచేయడానికి రూ. లక్ష అడిగి ఇందుకు పేట ఎమ్మెల్యే రికమండేషన్ లెటర్ కావాలని తానే నకిలీది తయారు చేసి సంతకం కూడా ఫోర్జరీచేస్తానని వారికి తెలుపగా అందుకు వారు కూడా ఒప్పుకొన్నారు.తర్వాత సత్తెమ్మ తనకు తెలిసిన వారినుండి రూ. లక్ష జ్యోతికి ఇవ్వగా జ్యోతి అట్టి దానిలో రూ.15000 తన వద్ద ఉంచుకొని మిగతా రూ.85000 శైలేష్‌కి ఇచ్చిందని

- మిగతా4లో..

## సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

**గద్వాల జనవరి 29 ప్రభాతవార్త :** కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు మల్దకల్ మండల వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధికి నమోదు చేసుకున్న వారికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. మల్దకల్ మండలానికి చెందిన 15 మంది లబ్ధిదారులకు రూ.5లక్ష 47000 రూపాయలు చెక్కులు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, సత్యం రెడ్డి, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, మాజీ జడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ విష్ణు, మాజీ కౌన్సిలర్ శ్రీను, సుదర్శన్, సుధాకర్, నాయకులు తూం కృష్ణ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు నర్సింహులు, చంద్రశేఖర్ ,మోబిన్ రామాంజనేయులు, నాగేంద్ర యాదవ్, ప్రభాకర్, మహేష్, నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**అమరచింత జనవరి 29 ప్రభాతవార్త :** సైబర్ నేరగాళ్లపట్ల ప్రజలు, రైతులు, యువకులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని అమరచింత ఎస్సై సురేష్ కోరారు. బుధవారం అమరచింత యూనియన్ బ్యాంక్ దగ్గర బ్యాంక్ కస్టమర్లకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుర్తు తెలియని వ్యక్తులు మోసాలకు సంబంధించిన యాప్ల ద్వారా సెల్ ఫోన్ లకు లింకులు పంపుతున్నారని ఫోన్ కు వచ్చే లింకులను ఓపెన్ చేస్తే ఓటిపి చెప్పాలని అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అలాంటి లింకులను ఓపెన్ చేయకుండా ఉండాలని ఆయన కోరారు. అలాగే యువకులు, విద్యార్థులు లోన్ యాప్ కు దూరంగా ఉండాలని ఆయన వారిని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి నెల బుధవారం బ్యాంకు దగ్గర అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. అలాగే ఆయా గ్రామాలలో గుర్తుతెలియని అనుమానితులు ఉంటే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అమరచింత పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


కస్టమర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేష్

## కంప్యూటరీకరణ వేగవంతంగా పూర్తి చేయాలి

**ఉప్పునుంతల,జనవరి 29 ప్రభాతవార్త :** ప్రజా పాలన గ్రామ సభలలో వచ్చిన దర ఖాస్తులను వెను వెంటనే కంప్యూటరీకరణ పూర్తి చేయాలని ఉప తహసీల్దార్ కేశవ్ అన్నారు. బుధవారం ఉప్పునుంతల రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారుల కు సూచించారు. 7 క్లస్టర్ పరిధిలో వచ్చిన రైతు భరోసా దరఖాస్తులను పరిశీలించారు. వ్యవసాయ అధికారులు అదనంగా రైతు భరోసా దరఖాస్తులు స్వీకరిస్తూ, నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఉప తహసిల్దార్ రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి రమేష్‌తో పాటు మండల విస్తీర్ణ అధికారులను సమన్వయ పరుస్తూ కంప్యూటరీకరణ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పరిశీలించిన వారిలో ఉప తహసీల్దార్ కేశవ్‌తో పాటు మండల వ్యవసాయ అధికారి రమేష్, మండల వ్యవసాయ విస్తీర్ణాధికారులు మంజుల, చిన్యా నాయక్, సంతోష్ నాయక్, సుమతి, శ్రీలత, రాగ సంధ్య, మహేష్‌లు ఉన్నారు.

## జాన్ వెస్లీ ఎంపిక పట్ల హర్ష వ్యక్తం

**కొత్తకోట జనవరి29 ప్రభాతవార్త :** తెలంగాణ సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా జాన్ వెస్లీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల మదనాపురం మండల సీపీఐఎం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండలం కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా దగ్గర రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన కామ్రేడ్ జాన్ వెస్లీకి శుభాకాంక్షలు తెలిపి రెడ్ సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వెంకట్ రాములు మాట్లాడుతూ విద్యార్థి యువజన సంఘం నాయకుని నుండి పోరాటాన్ని సాధించిన జాన్ వేస్లీ అంచాలంచెలుగా ఎదిగి ఈ స్థాయికి చేరాడని గుర్తు చేశారు. అదేవిధంగా కేవీపీఎస్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అంటరానితనానికి వ్యతిరేకంగా సైకిల్ యాత్ర నిర్వహించారని చెప్పారు. ప్రజా సంఘాలలో చురుగ్గా పనిచేస్తూ అంచలంచలుగా ఎదిగి ఈరోజు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారని తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన మహాసభల్లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడి మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన అమరచింత పట్టణ నివాసి అయిన జాన్ వెస్లీని సిపిఎం పార్టీ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మని వర్ధన్, చెన్నయ్య, వెంకటేష్, చీర్ల ప్రసాద్ చిరంజీవి, మాసన్న, లక్ష్మయ్య, మొగిలి, శివాజీ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


మదనాపురంలో రెడ్ సెల్యూట్ చేస్తున్న కామ్రేట్స్

## ఎమ్మెల్యే చేతుల మీదుగా మెటీరియల్ పంపిణీ

**ఆత్మకూరు జనవరి 29 ప్రభాతవార్త :** మఖ్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి చేతులమీదుగా గురువారం రోజు ఆత్మకూరు పట్టణంలోని సాయి వాణి తిరుమల ఫంక్షన్ హాల్ లో ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేయున్నట్లుగా ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరమేష్ ,మాజీ మండల అధ్యక్షుడు రహమతుల్లా తదితరులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు డిజిటల్ స్థాయిలో పాఠాలు నేర్చుకునేందుకుగాను ఒక్కొక్కరికి 1800 విలువచేసే స్టడీ మెటీరియల్‌ను ప్రత్యేకంగా తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేయునట్లుగా వారు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై మెటీరియల్ అందుకోవాల్సిందిగా వారు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి

**ఏఐవైఎఫ్, జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్**

**అమరచింత జనవరి 29 ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, ఎండి కుతుబ్ డిమాండ్ చేశారు. బుధవారం అమరచింత మండలంలోని కొంకోనివాని పల్లె గ్రామంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 13నెలలు గడుస్తున్న గ్రామాలు అభివృద్ధి జరగడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొంకనివాళి పల్లె గ్రామంలో కొత్త కాలనీ ఏర్పాటు అయినా కాలనీలో డ్రైనేజీలు, సిసి రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే అధికారులు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని ఆయన అధికారులను కోరారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో అనేక వాగ్దానాలు చేసిన ఇప్పటివరకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన అన్నారు. ప్రభుత్వం గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, గోవిందు, రాములు ,సాయిలు ,మహేష్ ,కవిత తదితరులు పాల్గొన్నారు.


పల్లె గ్రామంలో మాట్లాడుతున్న ఎం డి కుతుబ్

## ఉప్పరిపల్లి సబ్ సెంటర్‌లో వైద్య పరీక్షలు

**ఉప్పునుంతల,జనవరి 29 ప్రభాతవార్త :** మండలంలోని ఉప్పరిపల్లిగ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉప్పునుంతల వారి ఆధ్వర్యంలో బుధవారం వైద్యశాల ఉప కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా గ్రామంలో ఆశా కార్యకర్తలు గుర్తించిన గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అవగాహన కల్పించారు.గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్త పట్ల వైద్యపరీక్షలు ఎప్పటికప్పుడు చేయించు కోవాలంటూ, ఆశాకార్యకర్తల సహకారం తీసుకొని అందుబాటులో ఉన్న వైద్య సిబ్బందికి వివరించాలని, బాలింతలు చాలాజాగ్రత్తలు పాటించాలని చిన్నపిల్లలు కావడంతో నిర్లక్ష్యంచేయకూడదని వారికి పలు సూచనలు ,సలహాలు అందిస్తూ వైద్య సేవలు అందించారు. కొంతమందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారిణి డా. స్వప్న, హెల్త్ సూపర్వైజర్ ప్రభావతి, ఎంపిహెచ్ఓ మధునాయక్, సిబ్బంది శ్రీనయ్య, సరితా, నిర్మల, ఎంఎల్ హెచ్‌పి ఐశ్వర్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారిణి డా. స్వప్న

# 420 రోజుల్లో.. 420 హామీల మోసాలు

**బిజినేపల్లి, జనవరి 29 ప్రభాతవార్త :** నూరు రోజు ల్లో 420 హామీలు అమలు చేస్తామని ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్,420 రోజుల్లో హామీలు అమలు చేయక ప్రజలను మోసగించారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎంపీపీ పుప్పాల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలకు జనవరి 30 నాటికి 420 రోజులు పూర్తవుతున్న సందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున కార్గే కలలోకి వచ్చి బుద్ధి చెప్పేలా గాంధీజీని విజ్ఞప్తి చేస్తామన్నారు. తెలంగాణ యువతకు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కాంగ్రెస్ నాయకులు ముఖం చాటేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలతో రైతులను, విద్యార్థులను, మహిళలను, వృద్ధులు, వికలాంగులు, వితంతువును మోసం చేశారని అన్నారు. అలవికాని హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చలేక కాంగ్రెస్ సర్కారు ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. నాలుగు పథకాల అమలు బోగస్ అని ఒక్కో మండలంలో ఒక్క గ్రామాన్ని తీసుకొని పథకాల అమలు చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు,ఆత్మీయ భరోసా,రేషన్ కార్డులు పేరుతో దరఖాస్తులు తీసుకొని తెల్లారేసరికి మాట మార్చారని, గ్రామసభల్లో తీసుకున్న దరఖాస్తులు బుట్ట దాఖలు చేశారని విమర్శించారు. రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు నెల్లికంటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అసమర్థ పాలన కారణంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుని స్థాయికి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా పై ముఖ్యమంత్రి మాటలు నమ్మకం లేకుండా పోయాయని జనవరి 26న రైతుల ఖాతాల్లో భరోసా డబ్బులు జమ చేస్తామని మార్చి 31 లోపు రైతుల ఖాతాలో జమ చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 2లక్షల రుణమాఫీ చేస్తామని 13 నెలలు గడిచిన పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతాంగానికి ఇస్తామన్న పెట్టుబడి సాయం అందక అన్నదాతలు అరి గోసపెడుతున్నారని, ఎద్దేడిచిన యవసం, రైతు ఏడ్చిన రాజ్యం కూలిపోక తప్పదని చెప్పారు. ఈ సమావేశంలో శేఖర్‌రావు, జగదీష్‌రెడ్డి, శీర్ణం బాలస్వామి, వెంకట్‌రెడ్డి, అల్లోజీ ,జగదీష్, ఇ.శ్రీనివాస్ రాజుగౌడ్, రవీందర్ రెడ్డి, అచ్యుత్ రెడ్డి, లక్ష్మయ్య, వంశీ, దేవుల లిబియానాయక్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## ఏబీసీడీ వర్గీకరణ వల్లే ఎస్సీలకు న్యాయం జరుగుతుంది

**వచ్చే నెల 7వ తేదీన హైదరాబాద్ లో లక్ష డప్పుల మహా ప్రదర్శనను విజయవంతం చేయండి: డప్పు స్వామి**

**కొత్తకోట జనవరి 29 ప్రభాతవార్త :** ఏబీసీడీ వర్గీకరణ వల్లే ఎస్సిలకు న్యాయం జరుగుతుందని అందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏబీసీడీ వర్గీకరణ అమలు వెంటనే చేయాలనీ కోరుతూ వచ్చే నెల 7వ తేదీన హైదరాబాద్‌లో లక్ష డప్పుల మహా ప్రదర్శనను నిర్వహిస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్రనాయకులు డప్పుస్వామి అన్నారు.బుధవారం కొత్తకోటలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర లక్ష డప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. ముందుగా రాజ్యాంగ నిర్మాణ కర్త అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమం ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు జెయం మిషేక్, ప్రేమదానం సభధ్యక్షత వహించారు. డప్పుస్వామి మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పోరాటం వల్లే ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలనీ సుప్రీం కోర్ట్ తీర్పు వెల్లడించిందని చెప్పారు. కేంద్ర ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూడా వర్గీకరణ కావాలి ఎస్సిలకు న్యాయం జరగాలని కోరుతూ పార్లమెంట్లో తీర్మానం చేశారని గుర్తు చేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఏబీసీడీ వర్గీకరణ న్యాయభద్ధమైనదే అని అసెంబ్లీలో తీర్మానంచేయడం జరిగిందని అందుకు స్వాగతిస్తూ వాటిని వెంటనే అమలుచేయాలనీ డిమాండ్ చేశారు. ఏబీసీడీవర్గీకరణ కావొద్దు అని మాలలు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు.ఎస్సి వర్గీకరణ అమలు అయితే ఎస్సిలో ఉండే 59ఉప కులాలకు న్యాయం జరుగుందని చెప్పారు.వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చేసిన వీరపోరాటలను కేంద్రం గుర్తించి ఇటీవల పద్మశ్రీ అవార్డు వచ్చిందని గుర్తు చేశారు. ఈ లక్ష డప్పులు వెయ్యి గొంతులు మహా ప్రదర్శన కార్యక్రమం విజయవంతం చేసేందుకు మంద కృష్ణ మాదిగ 33 జిల్లాల యాత్ర చేపట్టాడన్నారు.అందుకు ఈనెల 7వ తేదీనుండి డప్పులబృందంతో కలిసి మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లాలు మండలాలు తిరుగుతూ ఆటపాటతో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, కాంగ్రెస్ జిల్లాకార్యదర్శి కృష్ణారెడ్డి,బోయోజ్,మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి,మేస్త్రిశ్రీను,అంబేద్కర్ కమిటీఅధ్యక్షులు ఇశ్రాయిల్, అయ్యన్న,సుభాష్,సుజ్ఞానం,రాజు, కుమార్,గంధం గట్టన్న,చెన్నయ్య, సంపత్ కుమార్,భాస్కర్,నెహ్రు,రాకేష్,నవీన్,రవి,కిరణ్, ఎల్లప్ప,సంజీవుడు, ప్రశాంత్, మహేష్, పెద్ద కుర్మయ్య, డీకే లక్ష్మయ్య, నాగన్న, ఇశ్రాయిల్, ప్రభుదాస్, దాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దండోరా నాయకులు డప్పు స్వామి

## బండి సంజయ్‌ని భర్త రఫ్ చేయాలి

**ఆత్మకూరు జనవరి 29 ప్రభాతవార్త :** ప్రజా గాయకుడు గద్దర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా పద్మశ్రీ అవార్డుకు అర్హుడు కాదని అవమానంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని తక్షణమే భర్త రఫ్ చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రోజు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో అఖిలపక్ష పార్టీల సమావేశం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా జీవితంలోని పుదిశ్వాస వరకు పోరాటాలు నిర్వహించిన గద్దర్ పై అన్చిత వ్యాఖ్యలు చేయడం బండి సంజయ్‌కి ఎంతమాత్రం తగదని వారు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలిపెట్టి పేద ప్రజల బాగోగుల కోసం అను నిత్యం పోరాటాలు నిర్వహించిన గద్దర్ పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి బిజెపి సమర్థిస్తుందా లేక వ్యతిరేకిస్తుందా అనే విషయాన్ని ప్రజలకు స్పష్టం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. పద్మశ్రీ అవార్డుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన పేర్లను కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం పురస్కారాలు ప్రకటించడం ఇప్పటికైనా మానుకోవాలని లేనిపక్షంలో భవిష్యత్తులో జరగబోయే పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాంతి సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహ శెట్టి ,సిపిఎం మండల కార్యదర్శి రాజు ,సిపిఐ మండల కార్యదర్శి రాబర్ట్ ,సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు మాసన్న ,వాల్మీకి సంఘం తో పాటుగా వివిధ ప్రజా సంఘాలకు చెందిన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

## స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

**నవాబుపేట, జనవరి 29 ప్రభాతవార్త :** త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు అందరూ సమన్వయంతో ముందుకెళ్లి ప్రతి గ్రామంలో సత్తా చాటాలని మండల కేంద్రంలోని పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ సింగిల్విండో చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మాడెమోని నర్సింలు ఈ సందర్భంగా తెలియజేశారు. మాజీ ఎంపీపీ అనంతయ్య మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బిఆర్ఎస్‌పార్టీకి మంచి రోజులు రాబోతున్నాయని ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపైన అసహనం వ్యక్తం చేస్తున్నారని పథకాలు అమలు పరచడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని ఈసందర్భంగా తెలియజేశారు.జడ్చర్లనియోజకవర్గ టిఆర్ఎస్ నాయకులు కొడుగల్‌యాదయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి3న మాజీమంత్రి లక్ష్మారెడ్డి పుట్టినరోజు సందర్భంగా జడ్చర్లలో నిర్వహించే రక్త రక్తదాన శిబిరానికి అధిక సంఖ్యలో తరలిరావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సింగిల్ విండో చైర్మన్ మాడేమోని నర్సింలు,మాజీ ఎంపీపీ అనంతయ్య, సీనియర్ నాయకులు నాగిరెడ్డి,మాజీఎంపిటిసి వీరబోజాచారి, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపిటిసి సత్యం, టిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు కొడుగల్ యాదయ్య, మురళి, టిసిఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి రవీందర్, చందర్ నాయక్, చెన్నారెడ్డి మాజీ సర్పంచ్ యాదయ్య, కారుకొండ పురుషోత్తం,మాజీసర్పంచ్ గోపాల్,కృష్ణయ్య,గురుకుంట ప్రతాపరెడ్డి,సంతోష్‌రెడ్డి,మండల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## మత్తు పదార్థాలకు అలవాటు పడకుండ జాగ్రత్తలు తీసుకోవాలి

**గద్వాల జనవరి 29 ప్రభాతవార్త :** బాలలు మత్తుపదార్థాలకు అలవాటు పడకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, వాటి వల్ల జరిగే అనర్థాలను తెలియపరచాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి డి.సునంద అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారతదేశంలో అబ్బాయిల సంఖ్య కంటే అమ్మాయిల సంఖ్య తక్కువగా ఉందని, బాలికల విద్య, ఆరోగ్య పరిరక్షణ, సమానత్వం అత్యంత అవసరమని వివరించారు. ఆడ పిల్లలు సరైన పోషకాహారం తీసుకోవడం,ఆరోగ్యంగా ఉండడం ఎంతో ముఖ్యమని, సమయానికి సరైన ఆహారం తీసుకుంటే, శారీరకంగా, మానసికంగా బలంగా ఉండవచ్చని ఆమె తెలిపారు. సమాజంలో అన్ని రంగాల్లో స్త్రీలు రాణించేందుకు విద్య అత్యవసరమని, బాలికలు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండని బాలికలు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా ఇలాంటి ఇలాంటి సంఘటనలు జరిగితే చైల్డ్ లైన్ 1098కి కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. ఈ సమాచారాన్ని గోప్యంగా ఉంచి, బాధిత బాలికల భవిష్యత్తును రక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా మత్తు పదార్థాలకు డ్రగ్స్, దూరంగా ఉండాలని, గద్వాల జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు గాని, వ్యాపారం చేస్తున్నట్లు గాని తెలిసినట్లయితే 1908 టోల్ ఫ్రీ నంబర్ కి ఫిర్యాదు చేయాలని తెలిపారు. పిల్లలు చదువు మానేసి పొలాల్లో, మెకానిక్ షాపుల్లో, హోటళ్లలో లేదా ఇతర కూలీ పనుల్లో కనిపించిన వెంటనే 1098 కి కాల్ చేసి అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి హెడ్ మాస్టర్ విజయలక్ష్మి, డి. హెచ్. ఈ.డబ్లు నాగరాజు, ఎన్.జి.ఓ విద్యుల్లత, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సూచనలు చేస్తున్న జిల్లా సంక్షేమ అధికారి సునంద

## పదిలో మంచి ఫలితాలు సాధించాలి : డిఈఓ ప్రవీణ్ కుమార్

**చిన్న చింతకుంట, జనవరి 29 ప్రభాతవార్త :** పది పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని జిల్లా విద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు.బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు స్టడీ అవర్‌లో చదువుకుంటున్న ఆంగ్ల బోధనపై విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యపుస్తకంలోని పలు పాఠ్యాంశాలను విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. సిలబస్ పూర్తి చేశారా, విద్యార్థినిలకు మెరుగైన విద్యను అందించి పది పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా రాసేలా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థినిల మార్షల్ ఆర్ట్స్‌లో మెలుకులను నేర్చుకోవాలని ఆయన సూచించారు. డిఈఓ వెంట మండల విద్యాధికారి మురళీకృష్ణ ,కస్తూర్బా పాఠశాల ఎస్ఓ, సిఆర్పి విజయ్ సింహలు ఉన్నారు.


విద్యబోధనపై అడిగి తెలుసుకుంటున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

## వెల్టూర్‌లో బ్రహ్మోత్సవాలు

**ఉప్పునుంతల,జనవరి 29 ప్రభాతవార్త:** మండలంలోని వెల్టూరు గ్రామంలో ఫిబ్రవరి 4 నుంచి శ్రీ అలివేలు మంగ సమేత లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.4న మంగళవారం వేకువ జామున 5.30 గంటలకు ద్వజారోహణం, ఉదయం 8 గం.లకు పూర్ణా భిషేకం,ఉదయం 10గంటలకు శేషవాహన సేవ, సూర్య వాహన సేవ, మధ్యాహ్నం 12.30గం.లకు అశ్వవాహన సేవ, రాత్రి 7గం.లకు స్వామివారి ప్రత్యేక పూజలు, రాత్రి 8గం.లకు శ్రీవారి కళ్యాణ మహోత్సవం, రాత్రి 10 గం.లకు భక్త బృందంచే భజన కార్యక్రమం,5న బుధవారం 5గం.లకు రథోత్సవం, రాత్రి కుంకుమార్చన, రాత్రి9.30గం.లకు ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని వారు పేర్కొన్నారు.

## లక్ష డప్పులు వెయ్యి గొంతులు

**మినీ మహా ప్రదర్శనను విజయవంతం చేద్దాం**

**బిజినేపల్లి, జనవరి 29 ప్రభాతవార్త :** లక్ష డప్పులు వెయ్యి గొంతులు మినీ మహా ప్రదర్శనను విజయవంతం చేద్దామని దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర నాయకులు కరిగల్ల సుదర్శన్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి రానున్న సందర్భంగా మాదిగ, మాదిగ ఉపకులాలు డప్పు సంకన వేసుకొని ప్రతి గడప నుండి మందకృష్ణ మాదిగకు సంఘీభావాన్ని తెలపాలని కోరారు. దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర నాయకులు కరిగల్ల సుదర్శన్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్ట్ ఫోరం మండల అధ్యక్షులు బంగారయ్య, మండల ప్రధాన కార్యదర్శి మహేష్, నాయకులు నరసింహ, వెంకటేష్, మాసన్న తదితరులున్నారు.

## ఉపాధి ఉద్యోగుల వేతనాలు చెల్లించండి


వినతి పత్రాలను అందజేస్తున్న ఉపాధి ఉద్యోగులు

**చిన్నచింతకుంట, జనవరి 29 ప్రభాతవార్త :** మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, తహసిల్దార్ ఎల్లన్నకు వేరువేరుగా వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీవో నవీన్ కుమార్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వెంటనే వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపడతామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకి రూ.10వేల వితరణ

**మూసాపేట్,జనవరి 29 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2004/2005 పదవ తరగతి పూర్వ విద్యార్థులు రూ. 10 వేలు వితరణ చేశారు. తామ చదువుకున్న పాఠశాలకు ఏదో చిన్న సహాయం చేయాలని సంకల్పంతో 2004 2005 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాల నేమ్‌బోర్డ్‌కి బుధవారం పదివేల రూపాయలు ఉపాధ్యాయులకు అందజేశారు. ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ప్రతి ఒక్కరు కూడా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నర్సప్ప, భాస్కర్, శరణప్ప, పరమేశ్వర్, కాజన్న ,సీజీ మధుసాగర్ 2004/2005 పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల వేతనాల గడువు పొడగింపు

**గద్వాల జనవరి 29 ప్రభాతవార్త :** 2024-25 సంవత్సరానికిగాను గద్వాలజిల్లాలోని ప్రభుత్వలేదా ప్రవేట్‌పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులు ఫ్రీ ,పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకోసం దరఖాస్తు తేదీని మార్చి 31 వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల వివరాలను ఆన్ లైన్ వెబ్సైట్ లో దరఖాస్తు చేయాలని సూచించారు.దరఖాస్తు చేసుకున్న సంబంధిత ధ్రువపత్రాలను జిల్లా సంక్షేమశాఖ అధికారి కార్యాలయం రూం.నెం 33లో అందజేయాలని తెలిపారు. ఇతర సమాచారం కొరకు 94 40170160 నెంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

## జాతీయ స్థాయి క్రీడాకారుడికి ఘన సన్మానం


క్రీడాకారున్ని సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్, జనవరి 29 ప్రభాతవార్త:** ఇటీవల హైదరాబాదులో జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో మక్తల్ పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ హై స్కూల్ కు చెందిన ఫర్హాన్ పాల్గొని అసమాన క్రీడా ప్రతిభను ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు బుధవారం మక్తల్‌సీఐ జి.చంద్రశేఖర్ తన కార్యాలయంలో ఫర్హాన్‌ను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించి, ప్రత్యేకంగా అభినందించారు.ఈనెల 30నుంచి ఫిబ్రవరి 3వరకు చెన్నైలో జరిగే జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో ఫర్హాన్ పాల్గొంటారని టెన్ని కాయిట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దీప,విశ్రాంత పిఈటి బి.గోపాలం తెలిపారు. పీఈటీలు రమేష్ కుమార్,దామోదర్,స్వప్న,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే (ఐజేయు) నూతన డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న నాయకులు

**మహబూబ్‌నగర్, జనవరి29 ప్రభాత వార్త:** టీయూడబ్ల్యూజ ే(ఐజేయు) నూతన డైరీని యూనియన్ నాయ కులు బుధవారం ఆవిష్కరించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అధ్యక్షుడు దండు దతేంద్ర ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన సమావేశంలో మహబూబూబ్‌నగర్ యూనియన్ నాయకులతో కలిసి 2025 డైరీని ఆవిష్కరిం చారు. ప్రధానంగా అర్హులైన జర్నలిస్టులకు డబల్ బెడ్‌రూమ్ ఇల్లు, యూనియన్ సభ్యత్వాలు, జిల్లా మహాసభ ఏర్పాటువిషయాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బీజీ రామాం జనేయులు, ఉమ్మడి జిల్లా ఎలక్ట్రానిక్ కన్వీనర్ అహ్మద్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు జెమినిశేఖర్, జిల్లాఎన్నికల అధికారి వెంకట్,నాయకులు పేటవెంకటయ్య, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు పెంచాలి

**వనపర్తి టౌన్ జనవరి 29 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 20న జరిగే భవన నిర్మాణ కార్మికుల జిల్లా 3వ సభలకు నిర్మాణ రంగా కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలనీ టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.రాజు పిలుపునిచ్చారు. బుదవారం వనపర్తి జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రగతి శీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (టియుసిఐ) జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి టియుసిఐ జిల్లా ప్రధాన కార్య దర్శి సి.రాజు మాట్లాడుతూ...జిల్లాలో ప్రధానంగా కార్మికుల సమస్యలపై ముందు పోరాడే సంఘం తెలంగాణ ప్రగతి శీల భవన నిర్మాణ కార్మిక సంఘం (టియుసిఐ) అని గుర్తు చేశారు. 2009 నుండి ఇప్పటి వరకు టియుసిఐ ఆధ్వర్యంలో వేలాది మంది కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు అందిచడంలో ముందున్నామని తెలిపారు. భవిష్యత్‌లో కూడా కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉంటామని ఇలాంటి కార్మిక సంఘం వెంబడి కార్మికులు ఉండాలని పిలుపునిచ్చారు. తదనంతరం టియుసిఐ కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా నాయ కులు బి.గణేష్, టియుసిఐ జిల్లా నాయకులు వాకిటి రంగన్న, కడుకుంట్ల బుచ్చన్న, సి మన్నెం, సి.శ్రీను, అశోక్, మామిడిమాడ రాజు, కడుకుంట్ల మన్నెం, మస్తీపూర్ మన్నెం పాల్గొన్నారు.

### అధికారం ఎవరి జాగీర్ కాదు..

## ఎవరి ఇంట్లోంచి తెచ్చింది కాదు

మొదటి పేజీ తరువాయి భాగం..

వాహనాలు ఖరీదు చేయకుండా రెండు ట్రాక్టర్లను అద్దెకు తీసుకుని రు.1.32లక్షలు నిధులు దుర్వి నియోగం చేశారని ఆరోపించారు.పనులు చేయకుండా నిధులు వెచ్చించారని విమర్శించారు.తమ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో భూత్పూర్ మున్సిపాలిటీకీ రు.3.98కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు.ముడా నుంచి రు.78లక్షలు వచ్చాయని పేర్కొన్నారు.భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు.అమృత్ పథకం కింద మంచినీటి సరఫరా కోసం పట్టణ కేంద్రంలో ఐదు వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు,మెరుగైన,నాణ్యమైన విద్యుత్ సరఫరా ను అందించేందుకు 590విద్యుత్ లైన్లలో అత్యాధునిక లైట్లనేర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.పట్టణ కేంద్రంలో కమ్యూనిటీ హాల్, శ్మశానవాటిక నిర్మాణం,మహిళా సమాఖ్య భవన్ నిర్మాణా లు చేపడుతున్నట్లు తెలిపారు.వాల్యాతండా వద్ద ఉన్న డంపింగ్ యార్డులో బీఆర్‌సీ షెడ్ నిర్మా ణం చేపట్టి పరిసరాల్లో దుర్గంధ వాసన లేకుండా చేసే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు.మున్సి పాలిటీ కేంద్రంలోన జాతీయ రహదారి కూడలి చౌరస్తాను అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు చర్యలుతీసుకుంటున్నామన్నారు.చౌరస్తాలో బస్ షెల్టర్ నిర్మాణం,మూత్రశాలల ఏర్పాటువంటి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించామన్నారు.భూత్పూర్ మండలంలోని వివిధ గ్రామాలకు రోడ్ల నిర్మాణాలను నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు.నాగర్‌కర్నూల్ ఆర్‌అండ్‌బి రోడ్ నుంచి చౌల తండా మీదుగా కరివెన వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రు.3,58కోట్లు,గాజులపేట తాటికొండ రోడ్లకు రు.65లక్షలు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

**ఆత్మకూరు జనవరి29 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్ల పంపకంలో అధికార పార్టీ నాయకులు తీవ్ర అవకతవకలకు పాల్పడుతున్నారని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆత్మకూర్ సబ్ డివిజన్ సిపిఐ నాయకులు బుధవారం రోజు ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీరామ్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వ హించిన గ్రామసభలలో ఇందిరమ్మ ఇంట్లోఎంపిక చేసిన లబ్ధిదారుల్లో 50 శాతానికి పైగా అన ర్హులకే ప్రకటింపజేశారని అలా కాకుండా వాస్తవ పద్ధతిలో అధికారులు అర్హులైన వారిని ఎంపిక చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కేంద్రాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దు చేసినందున మున్సిపాలిటీ పట్టణాలలో ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు అందజేయలేకపోతున్నారని ఈ విషయాన్ని గుర్తించి ప్రభుత్వం వెంటనే మున్సిపల్ కేంద్రాలలో సైతంపేదవారికి ఇందిరమ్మ ఇండ్లనుమంజూరి చేసే విధంగా చర్యలు చేపట్టాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలోఆందోళన కార్యక్రమాలకు పునుకుంటామనివారు హెచ్చరించారు. ఎంపీడీఓ శ్రీరామ్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించిన వారిలో ఆత్మకూరు మండల కార్యదర్శి రాబర్ట్,జిల్లా కార్యవర్గ సభ్యులు మోష తదితరులతో పాటుగా సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## వేతనాలు అందించాలని ఎంపీడీఓకు వినతి

**వెల్దండ, జనవరి 29 ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు గత 3 నెలల నుండి జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, జీతాలు చెల్లించాలంటూ కోరుతూ ఉపాధి హామీలో పని చేస్తున్న ఉద్యోగులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీ డీఓ సత్యపాల్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీఓ ఈశ్వర్‌జి మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు నల్లబ్యాడ్జీలతో ఉద్యోగం చేస్తూ మా సమస్యలపై నిరసన తెలియ జేశామని, మూడు నెలల వేతనం పెండింగ్ ఉండడంతో వేతనం లేకుండా జీవనం గడవడం చాలా కష్టమైందని, ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు పే స్కేల్ అమలు కాలేదని, కావున వెంటనే మా న్యాయమైన కోరికలు తీర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు, తక్షణమే మా జీతాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

## ఉద్యోగ భద్రతతో కూడిన వేతనం ఇవ్వాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 29 ప్రభాతవార్త:** ఒప్పంద అధ్యాపకులకు ఉద్యగ భద్రతతో కూడిన వేతనం ఇవ్వాలని పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పీయూ క్యాంపస్‌లో ఫార్మసీ కాలేజీ నుంచి యూనివర్సిటీ ప్రధాన ముఖ ద్వారం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలలో పనిచేస్తున్న అర్హత గల అధ్యాపకులకు పీహెచ్‌డి గైడ్ షిప్ ఇవ్వాలని, మహిళా అధ్యాపకులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని అధ్యాపకులు డిమాండ్ చేశారు. డా.రవికుమార్, డా. ప్రభాకర్‌రెడ్డి, డా.ఈశ్వర్ కుమార్, డా. వెంకటేష్, డా.సోమేశ్వర్,డా.ప్రదీప్ డా.శివకుమార్‌సింగ్ పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ

**నారాయణపేట టౌన్, జనవరి 29 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 16న జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు సంబంధించిన క్యాలెండర్ ను బుధవారం డ్రాగన్ షాటోఖాన్ కరాటే డు స్పోర్ట్స్ వారి ఆధ్వర్యంలో కరాటే వ్యవస్థాపకులు సిహాన్ సలాం బిన్ కుమార్ అధ్యక్షతన పోస్టరు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా యణపేట జిల్లా కరాటే ఆర్గనైజేషన్ కమిటీ మాస్టర్ లతో కలిసి పోస్టర్ విడుదల చేయడం జరిగిం ది అన్నారు. జిల్లా కేంద్రంలో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలకు సుమారుగా 11 రాష్ట్రాల నుండి విద్యార్థులు మరియు మాస్టర్లు ఉన్నారు. జాతీయ సైక్ క్రీడలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్రాగన్ షాటోఖాన్ కరాటే డు స్పోర్ట్స్ సెక్రటరీ షేక్ అబ్దుల్ సలాం, వైస్ ప్రెసిడెంట్ కె.అంజన్ ప్రసాద్, చీఫ్ ఎగ్జామినర్, సి అమ్రేష్, టోర్నమెంట్ ఇంచార్జ్ మహమ్మద్ సలీం, కరాటే మాస్టర్లుతిమ్మప్ప, నానక్ రామ్, అశోక్, తాయప్ప, అనిల్, ధర్మేంద్ర,జ య శ్రీ,నవీన్, శ్రీనివాసులు, నర్సింలుతో పాటు తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలపై టియుటిఎఫ్ నిరంతర పోరాటం

◆ టియుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శైలం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త:** ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటం చేస్తుందని టియుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శైలం ప్రధాన కార్యదర్శి నేరేడు రవీందర్ పేర్కొన్నారు. బుధవారం కల్వకుర్తి ఎస్‌టిఓ విజయ్‌కుమార్, ఏటిఓ రమాదేవిలకు టియుటిఎఫ్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని వారు పేర్కొన్నారు. తరగతి గదిలో, దేశ, విద్యార్థుల భవితవ్యాన్ని రూపొందించడంలో ఉపాధ్యాయుల శ్రమ ఎనలేనిదని వారన్నారు. 2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వారు ప్రభుత్వ అధికారులకు, ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. టీయుటిఎఫ్ ద్వారా రూపొందించిన క్యాలెండర్ డైరీ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అధికారులు సంబంధించిన సమాచారం, ఉపాధ్యాయ విధులు అధికారాలు సర్వీస్ రూల్స్ తదితర సంబంధించిన అన్ని విషయాలను సంపూర్ణంగా పొందుపరచడం జరిగిందని వారు పేర్కొన్నారు..

## శ్రీకురుమతి కొండకు పోటెత్తిన భక్తజనం

◆ గిరి ప్రదక్షిణలో భక్తుల సందడి


ప్రధాన మెట్లపై దీపాలు వెలిగిస్తున్న భక్తులు

**చిన్న చింతకుంట, జనవరి29 ప్రభాతవార్త:** పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా కొలువబడుతూ పేదల తిరుపతిగా పేరు గాంచిన శ్రీ కురుమూర్తి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. బుధవారం మౌని అమావాస్య సందర్భంగా జిల్లా నలు మూలల నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారి పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించి కొండ దిగువ నుంచి ప్రధాన మెట్ల మీదుగా స్వామివారి సన్నిధికి చేరుకొని శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కురు మూర్తి వాస ..గోవిందా గోవిందా అంటూ భక్తుల గోవింద నామస్మరణతో కురుమతి గిరులు పులకరించాయి. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హించారు. శ్రీకురుమూర్తి చరిత్ర గిరి ప్రదక్షణ, శ్రీ కురు మూర్తి క్షేత్రంలో విశ్వహిందూ పరిషత్, శ్రీ కురుమూర్తి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ కురుమూర్తి గిరి ప్రదక్షణకు భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారి రాజ గోపుర ముఖద్వారం వద్ద దేవస్థాన చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి, గిరిప్రదక్షణను ప్రారంభించారు. అక్కడి నుంచి భక్తులు, శివస్వాములు ప్రధాన మెట్ల మీదుగా కొండపైకి వెళ్లి అక్కడి నుంచి పాత కోనేరు మీదుగా కొండల మధ్య గిరిప్రదక్షణ కొనసాగింది. కోరికలు తీర్చే కోనేటి రాయుడుగా భక్తులు కొలిచే శ్రీ కురుమూర్తి వెంకటేశ్వర స్వామి చుట్టూ గిరి ప్రదక్షణ చేయడంఎంతో పుణ్యమని భక్తులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేపట్టి నట్లు దేవస్థానం పాలకమండలి సభ్యులు, దేవస్థానం అధికారులు తెలిపారు.


గిరి ప్రదక్షిణను ప్రారంభిస్తున్న దేవస్థాన చైర్మన్

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

■ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన ఎమ్మెల్యే జీఎంఆర్

**చిన్నచింతకుంట,జనవరి 29 ప్రభాతవార్త:** చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుని నీతలరాతను మార్చుకోవచ్చని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మండల విద్యాభివృద్ధి కమిటీ, మండల విద్యాశాఖ ఆధ్వ ర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతుల కార్య క్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య దొరు కుతుందని, ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని ఆయన సూచిం చారు.గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదని ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టకుండా విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు పదివేలకుపైగా ఉపాధ్యాయులను నియమాకం చేసి విద్యా వ్యవస్థను గాడిలో పెట్టామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళా శాలలోని మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని, అదే విధంగా త్వరలోనే జూనియర్ కళాశాలకు సొంత భవనాన్ని ఏర్పాటు చేసేందుకుస్థలంపై దృష్టి పెడతామన్నారు. నియోజ కవర్గంలో విద్యపై ఆసక్తితోనే సొంత ఖర్చులతో అనుభ వజ్ఞులైన వారిచే స్టడీ మెటీరియల్ తయారుచేసి సులువుగా ఎలాంటి ఒత్తిడి లేకుండా పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకుఈ స్టడీ మెటీరియల్ ఎంతో దోహదపడు తుందన్నారు. ఇష్టంతో చదువుకుంటే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని జిల్లా విద్యాధికారి ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. అంతకుముందు సైకాలజిస్ట్ వంగి పురం శ్రీనాథ్ చారి మాట్లాడుతూ ఒత్తిడితో పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించలేరన్నారు.చిన్నారుల నృత్య ప్రదర్శననుఎమ్మెల్యే తిలకించి చిన్నారులను అభినందించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు స్టడీ మెటీరియల్‌లోని అంశాలను విద్యార్థులతో చదివించారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.ఈ కార్యక్రమంలో తహసిల్దారు ఎల్లన్న,ఎంఈఓ మురళీకృష్ణ, విద్యాభివృద్ధి కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, జూనియర్ కళా శాల ప్రిన్సిపల్ ప్రసన్నరాణి, పార్టీ మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, దేవరకద్ర వ్యవసాయమార్కెట్ చైర్మన్ కథ లప్ప,విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఆయా ఉన్నత పాఠశాలల జీహెచ్‌ఎంలు, విద్యార్థి కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎబివిపి ఆధ్వర్యంలో "ఖేలో భారత్" క్రీడోత్సవాలు

◆ మైదానంలో పరిగెత్తి మానసిక ఒత్తిళ్లను జయించుదాం ◆ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరేష్ తేజ


క్రీడాకారులతో రాష్ట్ర సహాయ కార్యదర్శి నరేష్ తేజ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో భారత్ ఖేలో క్రీడోత్స వాలు 2 రోజు కొనసాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ నరేష్ తేజ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతిలను పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఈ కార్య క్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ అభియాన్ యొక్క ముఖ్య ఉద్దేశం యువకులను మానసికంగా మరియు శారీరకం గా దృఢపరచడం అన్నారు. అందుకే విద్యార్థులను మైదానా లకు మరల్చుతున్నా మన్నారు. ప్రస్తుత సమాజంలో యువ కులు,విద్యార్థులు ముత్తు,మాదకద్రవ్యాలు, మొబైల్ ఫోన్స్ కి అలవాటు పడి మైదానాలకు దూరమయ్యారు.ఒంటరితనానికి అలవాటు పడుతూ విద్యార్థులు సమాజంలో కలివిడిగా ఉండ లేక చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్యలు చేసుకుంటున్న సందర్భాలెన్నో ఉన్నాయన్నారు.కాబట్టి వివేకానంద,సుభాష్ చంద్ర బోస్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు శారీరక దృఢత్వంతోనే మానసిక దృఢత్వం లభి స్తుందని అలాగే క్రీడా స్ఫూర్తితో జీవితంలో గెలుపోటములు సహజమని కష్టపడితే ఫలితం తప్పక లభిస్తుందని ఇలా ప్రతి ఆట మనకు స్ఫూర్తి నిస్తుందని కావున ప్రతి విద్యార్థి పాల్గొని ఈ ఖేలో భారత్ అభియాన్‌ని విజయవంతం చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శివశంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ బంగారు బాబు, జిల్లా కేల్ కన్వీనర్ రమేష్, సోషల్‌మీడియా ఇంచార్జ్ ప్రసాద్, సంయుక్త కార్య దర్శి శివ, మల్లేష్ యాదవ్, రాఘవేందర్, రమేష్, మహేష్, తిమ్మాజిపేట మండల కన్వీనర్ వెంకటేష్, విద్యార్థులు కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ వసతి గృహంలో ఇనుప రాడ్డు విరిగిపడి

## విద్యార్థి తలకు గాయం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

**అచ్చంపేట, జనవరి29 ప్రభాతవార్త:** తలకు ఇనుప కడ్డీ తగలడం తో ఓ విద్యార్థిని తలకు బలమైన గాయాల య్యాయి. వివరా ల్లోకి వెళితే పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంటున్న నందిని అనే విద్యార్థిని ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మంగళవారం ఉదయం ముఖం కడుకొన్నేందుకు కుళాయి దగ్గరకు వెళ్ళింది. కాళ్ళు, చేతులు కడుకుంటున్న సమయంలో.. భవనానికి ఉన్న ఇనుప రాడ్డు బోల్టు ఊడిపోయింది. దీంతో రాడ్డు విద్యార్థిని తలపై పడటంతో బలమైన గాయాలయ్యాయి. గాయ పడిన విద్యార్థిని పట్టణంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిం చారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థిని తలకు కుట్లు వేసి..ప్రమాద తీవ్రత తెలుసుకునేందుకు సిటీ స్కానింగ్ కోసం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యా ర్థిని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.ఘటన గురించి వసతి గృహం వార్డెన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

## ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల, కళాశాల హాస్టల్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి


వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జనవరి 29 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల కళా శాల హాస్టల్‌లను బుధ వారం ఆకస్మికంగా ప్రత్యేక అధికారి తహశీ ల్దార్ ఇబ్రాహీం, ఆహార పదార్థాలు, సరుకులు గదిని వంట సరుకులను కూరగాయలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతు ఎమైనా ఆహారం విషయంలో, భోజనం, వసతుల విషయంలో, బోధన తదితర సౌకర్యాలు ఎలా ఉన్నాయి అని విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

### ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో

## విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

**25 మందికి అస్వస్థత.. పాఠశాలలోనే చికిత్సలు**


విద్యార్థులకు చికిత్స చేస్తున్న దృశ్యం

**ధన్వాడ, జనవరి 29 ప్రభాతవార్త :** ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయింది. 25 మంది విద్యార్థులకు కడుపు నొప్పి రావడంతో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది వచ్చి చికిత్సలు చేశారు. మెనూ ప్రకా రం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వెజిటేబుల్ కర్రీ అందించారు. అయితే విద్యార్థులు ఈ భోజనం తిని కడుపు నొప్పి వచ్చిందని చెప్పడంతో ఇంటికి పోయిన విద్యార్థులు వారి కుటుంబీకులకు చేప్పడంతో వారు విద్యార్థులను తీసుకువచ్చి పాఠశాల వద్దనే చికిత్సలు చేప్పించారు. వైద్యాధికారి అనుష, వైద్య సిబ్బంది కత లప్పు, బానుప్రియలు ఫుడ్ పాయిజన్ అయిన విద్యా ర్థులకు చికిత్సలు అందించారు. ఇంచార్జ్ ప్రధానో పాధ్యాయులు నరసింహచారి ఉపాధ్యాయ బృందం కలిసి దగరుండి చికిత్సలు చేయించారు.

## ఉచిత వైద్య శిబిరం

**నవాబుపేట, జనవరి 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఇప్పటూరు గ్రామంలో శంబ్ కార్ప్ సోలార్ ప్లాంట్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వ హించారు. ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను నవాబుపేట మండలం ఎంపీడీవో జయరాం నాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వ హించడం, పేద ప్రజలకు ఉచిత పరీక్షలు నిర్వ హించి వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావ డం పట్ల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ వైద్య శిబిరంలో రక్తపరీక్షలు,జనరల్,బీపీ, షుగర్, గైనకాలజీ, ఆర్థో ఈసీజీ,ఈఎన్ టీవంటి సేవలను ఉచితంగా నిర్వహించారు.

## ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

**మక్తల్, జనవరి 29 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని కర్ని ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీలింగమయ్య స్వామి ఆలయ అభివృద్ధికి చిట్యాల గ్రామానికి చెందిన మాజీ కో ఆప్షన్ మెంబర్ రహమత్ పాష బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్తులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రహమత్ పాషను శాలువాతో ఘనం గా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గాసం చిన్న రంగప్ప, గ్రామస్తులు శ్రీనివాస్ గౌడ్, పట్నం బాలప్ప, వాకిటి అంజప్ప, ఎద్దుల చిన్న హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడాకారులకు సన్మానం

**మద్దూర్, జనవరి 29 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఖో ఖో రగ్బి విభాగంలో జాతీయస్థాయికి ఆడిన రాజశేఖర్ రెడ్డి, పాశం వరుణ్, శివలను పాఠశాల హెచ్ఎం సవిత సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్రమశిక్షణతో ఆడుతూ ఇకముందు కూడా రాష్ట్ర జాతీయ స్థాయిలో ఆడి తల్లిదండ్రులకు గ్రామానికి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ విద్యార్థులు మొదలగువారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్‌కు ఘన సన్మానం

**గద్వాల జనవరి 29 ప్రభాతవార్త:** పదవి కాలం ముగియడంతో 7వ వార్డు మాజీ కౌన్సలర్ విష్ణుప్రియ దౌలుని అన్ని పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు శాలువాతో బుధవారం సన్మానించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజలు ఐక్యతను చాటారు. మాజి కౌన్సలర్ విష్ణుప్రియ దౌలు మాట్లాడుతూ ఇక ముందు నుండి కూడా ఇలాగే కలిసి మెలిసి ఉండాలని, నా మీద ఇంతటి ప్రేమాభిమానాలు చూపిన మీ అందరికి పేరు,పేరున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయకిష్ణ, టీఎన్ ఆర్ జగదీష్, గోపాల్, దౌలు, బిల్డర్ రామకృష్ణ, మనోజ్, నాగరాజు, కబడ్డీ కృష్ణ, హనుమంతు, నరసింహ, బొజ్జన్న, రఘు, శంకర్, లక్మన్న, గజ్జన్న, అనిల్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## సృజనాత్మకతను పెంపొందేలా బోధన జరగాలి

**బిజినేపల్లి జనవరి29 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొం దించేలా విద్యా బోధన జరగాలని ఎంఈవో రఘునాథ్ శర్మ ఉపాధ్యాయ లకు సూచించారు. లట్టుపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధ వారం ఆయన అకస్మిక తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు .ఆయా తరగతుల విద్యార్థుల సాధన సామార్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల ప్రజ్ఞ స్థాయిని బట్టి విద్యా బోధన చేపట్టి మెరుగైన విద్యార్థులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యా యులకు సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య, ఉపాధ్యాయులు సునీత తదితరులు ఉన్నారు.

## 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలి

**గద్వాల జనవరి 29 ప్రభాతవార్త:** 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల్లో రోజువారీగా స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిని ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం గద్వాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దు) మీడియం, దౌదర్‌పల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యా ర్థులకు సాంఘిక శాస్త్రంలో నిర్వహిస్తున్న స్లిప్ టెస్టును ఆమె పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షలలో మంచి ఫలితాలు సాధించే దిశగా కృషి చేయడం జరుగు తుందని, ఇందు కోసం విద్యార్థుల చదువు పట్ల ప్రత్యేక దృష్టి సాధించడం జరిగిందన్నారు.ఇందులో భాగంగా ప్రతిరోజు జిల్లాలోని వివిధ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులతో పాటు, విద్యార్థుల మానసిక ధైర్యాన్ని పెంచే విధంగా ప్రేరణ క్లాసులును నిర్వహించి విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతిరోజు ఉన్నత పాఠశాలలను సందర్శించి పర్యవేక్షించడం జరుగు తుందని ఆ ప్రకటనలో ఆమె తెలియజేశారు.

## నూతన ఎంపీడీవోను కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

**ఇటిక్యాల,జనవరి29 ప్రభాతవార్త:** ఉమ్మడి ఇటికాల మండలంలోని ఎర్రవల్లి గ్రామ పంచాయతీని గత ప్రభుత్వం ఎర్రవల్లి మండలంగా ఏర్పాటు చేసిం ది. అందులో భాగంగా కొత్త ఎర్రవల్లి మండలానికి ధరూరు మండల ఎంపీ ఓగా పనిచేస్తున్న అబ్దుల్ సయ్యద్ ఖాన్‌ను ఎంపిడిఓగా నియ మించడంతో ఆయన బాధ్యతలు చేపట్టగా బుధవారం కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, నాయకులు బజారన్న, యువరాజు, బల రాముడు తదితరులు ఆయనను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత : కేసు నమోదు

**చిన్న చింతకుంట, జనవరి29 ప్రభాతవార్త:** ఊక చెట్టు వాగు నుంచి అక్ర మంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేస నట్లు ఎస్సై ఆర్ శేఖర్ తెలిపారు. మరికల్ మండలం రాకొండ గ్రామ సమీ పంలోని ఊకచెట్టు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమం గా ఇసుకను తరలిస్తుండగా లాల్‌కోట చౌరస్తాలో పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.ఐదు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసా గిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

**మాగనూరు, జనవరి 29 ప్రభాతవార్త:** మాగనూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రిష్ణ,మాగనూర్ మండలాల్లోని అన్ని ప్రభు త్వ పాఠశాలలోని పదవ తరగతి చదివే విద్యార్థినీ, విద్యార్థులకు పదవ తరగతి పాఠాలు సులభంగా అర్థమయ్యేలా 2,3 యానిమేషన్స్‌తో క్యూఆర్ కోడ్ కలిగిన స్టడి మెటీరియల్‌ను విద్యార్థినీ, విద్యార్థులకు పంపిణీ చేసిన మక్తల్ నియోజకవర్గ శాసన సభ్యులు డా.వాకిటి శ్రీహరి మరియు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మరికొన్ని రోజుల్లో పదవ తరగతి పరీక్ష లు సమీపిస్తున్న వేళ అందరు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి, జిల్లా విద్యాధికారి, స్థానిక ఎంఈఓలు, మంగనూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనందగౌడ్, వాకిటి శ్రీనివాస్, చక్రపాణిరెడ్డి, నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకర్గ మండలాల అధ్యక్షులు, ప్రభుత్వ పాఠశాల ప్రధా నోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**పానుగల్ జనవరి29 ప్రభాతవార్త:**మండల పరిధిలోని బండపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మల్లు రవి సహకారంతో కాంగ్రెస్ పార్టీ మాజీ జెడ్పిటిసి రామ్మూర్తి నాయుడు ఆధ్వర్యంలో బండపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు కోమారి లక్ష్మి దేవమ్మ భర్త నాగన్నకు32000 వేల రూపాయల చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సహాయనిధి అనేది ఆపదలో మనకు ఆరోగ్య నిమిత్తం కోసం ఒక వరం లాంటిది. తెలం గాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలైన రైతు భరోసా, రుణమాఫీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, నూతనంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపథకం ఉపాధి హామీ పథకంలో 20 రోజులు పని చేస్తే నిరుపేద కుటుంబాలు ఒక గుంట కూడా భూమి లేని పేద వారికి ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ అనిఅన్నారు. ఇందిరమ్మ ఇండ్లను కూడా మంజూరు చేస్తుందని సొంత స్థలం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం ఉంటు ందని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజాపాలన నడు స్తుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఈ కార్యక్రమంలో మేస్త్రి నరసయ్య, మేస్త్రి ఆంజనేయుడు, డీలర్‌నరసింహ, పెద్దవెంకటస్వామి, రామకృష్ణ, నాగేశ్వర్, బాలమసి, బాలకృష్ణయ్య, మన్నేయ్య, శ్రీనివాసులు, జనార్ధన్, సింగోటి, సాయిలు, బాలయ్య, బుడ్డయ్య, నిరంజన్,గోవర్ధన్, చిన్న నాగులు, దేవ,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేయడం జరిగింది.

## నిధులు ఉన్న అభివృద్ధి శూన్యం

**కొత్తకోటలో అభివృద్ధి కావడం మీకు ఇష్టం లేదా? : దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**

**కొత్తకోట జనవరి 29 ప్రభాతవార్త:** కొత్తకోట మున్సిపాలిటీలో నిధులు ఉన్న అభివృద్ధి శూన్యం అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిఎద్దేవా చేశారు. బుధవారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిపాలిటీ అభివృద్ధిపై ఆయా శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ కొత్తకోటలో అభివృద్ధి కావడం మీకు ఇష్టం లేదని అందుకు ఉన్న నిధులను ఉపయోగించకుండా దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. బిఆర్ఎస్ ప్రభుత్వం గతంలో 17 పనులకు గాను 19 కోట్ల 80 లక్షలు నిధులు మంజూరైతే ఆ పనులు చేయానికే చేతకాక వదిలేసినా ఘనులు బిఆర్ఎస్ నాయకులు అని అన్నారు. 17 పనుల్లో 7 పనులకు 8 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు. మున్సిపాలిటీ కి సంబంధించిన స్టాంపు డ్యూటీ నిధులు 2 కోట్ల 28 లక్షలు మున్సిపాలిటీ ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు. మేము అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. పెండింగ్ వున్న వర్క్ లు అన్నీ కూడా టిఆర్ఎస్ హాయంలోనే ఆగిపోయాయని గుర్తు చేశారు. కొత్తకోట ను అభివృద్ధి చేతదామను చెప్పినబి.ఆర్.ఎస్ నాయకులు దీనికి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. సోషల్ మీడియా ద్వారా చాలామంది కొత్తకోటకు గ్రహణం పట్టిందని కొందరు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇక నుండి మిగిలిన బడ్జెట్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఖర్చు చేస్తామని తెలిపారు.కానాయపల్లి శంకర సముద్రం ప్రాజక్టును టిఆర్ఎస్ నాయకులు పట్టించుకోలేదు, కొత్తకోటలో గర్ల్స్ హైస్కూల్‌ను గాలికి వదిలివేశారు, ఆడపిల్లలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి గతంలో ఇబ్బందులు పడ్డారని మండిపడ్డారు. త్వరలో 1 కోటి 50లక్షల తో పాఠశాల నిర్మాణం చేయబోతున్నామని చెప్పారు. డ్రైనేజ్ తో కూడుకున్నటువంటి సిసి రోడ్ల నిర్మాణం చేపడుతాం, కొత్తకోట మున్సిపాలిటీకి 38 లక్షల మంచినీరు అవసరం ఉంది, ప్రస్తుతం 25 లక్షలు మాత్రమే ప్రజలకు మంచినీళ్లు అందుతున్నాయని త్వరలోనే సమస్యను పరిష్కరించి 5 లక్షల లిటరల్ నీటిని అదనంగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, సీడీసీ చైర్మన్ గొల్లబాబు, జిల్లా కార్యదర్శులు కృష్ణారెడ్డి, బోయోజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బిచపల్లి యాదవ్, పట్టణ అధ్యక్షులు మేస్త్రి శ్రీను, వేముల శ్రీనివాస్ రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాబు, మిషేక్, చర్లపల్లి శేఖర్ రెడ్డి, సుభాష్, అమ్మపల్లి బాలకృష్ణ, ముస్తఫా, బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ జీతాలు చెల్లించాలంటూ వినతి

**కల్వకుర్తి, జనవరి 29 ప్రభాతవార్త:** జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల 3 నెలలుగా జీతాలు అందక ఇబ్బంది పడుతున్నామంటూ, వెంటనే జీతాలు చెల్లించాలని బుధవారం మండల ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. జాతీయ ఉపాధి హామీ రాష్ట్ర జెఏసి పిలుపుమేరకు ఉపాధి హామీ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 3 నెలలుగా జీతాలు అందక, కనీసం నిత్యవసర వస్తువులు కొనలేని స్థితిలో ఉపాధి హామీ ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు పండగ, సెలవు దినాల్లో సైతం పని చేస్తూ ఆత్మీయ భరోస పథకాన్ని విజయవంతం చేయడానికి తీవ్రంగా ఉపాధి హామీ ఉద్యోగులు పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రమను గుర్తించకుండా ఉపాధి హామీ ఉద్యోగుల జీతాన్ని చెల్లించకుండా ,ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు .వెంటనే మూడు నెలల జీతాలను చెల్లించాలని లేనియెడల తీవ్రంగా ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

## ఆంజనేయుడి సన్నిధిలో యూత్ కాంగ్రెస్ నాయకులు

**ఊర్కొండ, జనవరి 29 ప్రభాతవార్త:** ఊర్కొండ మండల పరిధిలోని ఊర్కొండపేట శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలలో బుధవారం స్వామివారి అభిషేక పూజలలో రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు తూడి అనిల్ రెడ్డి, జడ్చర్ల అసెంబ్లీ యువజన మాజీ అధ్యక్షులు గంట వంశీధర్ రెడ్డి, యువజన నాయకులు వంశీచారి ప్రత్యేక పూజలలో పాల్గొని అభయుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఊర్కొండ మండలం కాంగ్రెస్ మాజీ యువజన అధ్యక్షులు చింతల మనోహర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు గుంజ ఆదినారాయణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులను సన్మానించారు.

## సబ్ సెంటర్లను సందర్శించిన మండల ఆరోగ్య అధికారి

**పానుగల్ జనవరి 29 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పానుగల్ వెంగలాయపల్లి తెల్ల రాళ్లపల్లి శాఖపూర్ సబ్ సెంటర్ లను మండల ఆరోగ్య అధికారి రామయ్య బుధవారం సందర్శించారు. సబ్ సెంటర్లల లో సాధారణంగా జరుగుతున్న ఇమ్యూనైజేషన్ సెషన్ సైట్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం రోజు గర్భిణీ స్త్రీలకు హెల్త్ చెకప్స్, వ్యాధి నిరోధక వ్యాక్సినేషన్ (టీకాలను) పట్టికలను పరిశీలించారు. గర్భిణీ స్త్రీలకు, చిన్నారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు, గర్భిణీ స్త్రీలకు వ్యాక్సినేషన్ ఐరన్ కాల్షియం లాంటి టాబ్లెట్లను ఇస్తూ సరైన ఆహారాన్ని ఆకుకూరలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెల్ల రాళ్లపల్లి లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఎమ్.ఎల్.హెచ్.పి. తార శశాంక్ ఉన్నారు. హెల్త్ అసిస్టెంట్ (ఎఎన్ఎం) నర్సమ్మ, నాగేశ్వర, రమాదేవి, సరళ, శ్రీలక్ష్మి ఆశ కార్యకర్తలు నాగమణి, లక్ష్మి, కవిత, సరస్వతి, అలివేలు, చిన్నమ్మ, గ్రామ గర్భిణీ స్త్రీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జీఎంఆర్‌కు ఘన సన్మానం

**భూత్పూర్,జనవరి 29,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలంలోని పలు గ్రామాలకు బీటి రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి(జీఎంఆర్)ను బుధవారం భూత్పూర్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వెల్కిచర్ల,కరివెన,చౌలతండాకు చెందిన ప్రజలు,కాంగ్రెస్ నాయకులు పూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు. నాగర్‌కర్నూల్ ఆర్‌అండ్‌బి నుంచి చౌలతండా మీదుగా కరివెన గ్రామం వరకు బీటి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే జీఎంఆర్ రు.నాలుగున్నర కోట్ల నిధులు మంజూరు చేయించినందున ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డితో పాటు నాయకులు దెంది లక్ష్మికాంత్‌రెడ్డి,హరియా నాయక్ కరివెన గ్రామస్తులు ముక్కంటి అశోక్‌రెడ్డి,కొత్తకాపు రాఘవేందర్‌రెడ్డి,కొత్తకాపు తిరుపతిరెడ్డి, గడ్డం చెన్నకేశవరెడ్డి,బిక్షపతి, శ్రీకాంత్‌రెడ్డి,నరేందర్‌రెడ్డి,అజయ్‌కుమార్‌రెడ్డి,అమరేందర్‌రెడ్డి,బర్రె చెన్నయ్య,పిండి కృష్ణయ్య తదితరులు ఎమ్మెల్యే జీఎంఆర్‌ను సన్మానించిన వారిలో ఉన్నారు.

## పేదల తిరుమల పాలెం వెంకన్న

**బిజినేపల్లి, జనవరి 29 ప్రభాతవార్త :** ఉమ్మడి పాలమూరు జిల్లాలోఅత్యంత వైభవంగా జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాలెం ఒకటి. అలువేలుమంగ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధి చెందింది. తిరుపతికి వెళ్లలేని భక్తుల కోసం స్వామి ఇక్కడ కొలువై ఉన్నాడని పెద్దలు చెబుతుంటారు. బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమై ఫిబ్రవరి 6 వరకు జరగనున్నాయి.పాలెం బ్రహ్మో త్సవాల్లో ముఖ్యఘట్టాలు కళ్యాణోత్సవం ఫిబ్రవరి 2 న, స్వామివారి రథోత్సవం ఫిబ్రవరి 4న, ఉద్దాల మహోత్సవం ఫిబ్రవరి 5 న జరుగుతాయని ఆలయ ఈఓ సిహెచ్ రంగారావు తెలిపారు.

**బ్రహ్మోత్సవ కార్యక్రమాలు:** 30న స్వామివారికి అభిషేక, కోయిలల్వార్, తిరుమంజసం, నిత్యారాధన, సాయంత్రం అంకురార్పణ, రుత్వీకరణం, నిత్యారాధన మత్సం గ్రహణం, హంస వాహనసేవ, 31 న హోమ బలిహరణాదులు, ధ్వజారోహణం, భేరిపూజ, గరుడ ప్రసాద నివేదన హనుమద్వాహనసేవ, ఫిబ్రవరి 1న నిత్యారాధరనలు, గరుడ వాహనసేవ, స్వామి, అమ్మవార్ల ఎదుర్కోళ్లు, 02న కళ్యా ణోత్సవం, సాయంత్రం గజవాహనసేవ, 03 న నిత్యారాధన, పల్ల కిసేవ, 04 న సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు, రాత్రి పది గంటలకు శ్రీవారి రథోత్సవం (తేరు), 05న నిత్యారాధనలు,అశ్వవాహనసేవ, 06 న సప్తావరణములు, శేషవాహనసేవ, దేవతా విసర్జన, ద్వాదశారాధనలు, పండిత సన్మానం, ఉత్సవ పరిసమాప్తి కార్యక్రమాలు ఉంటాయి.

**ఆలయ చరిత్ర:** పాలెం గ్రామ నిర్మాత తోటపల్లి సుబ్రమణ్యశర్మ 1961లో గ్రామస్తులైన రెడ్డి రెడ్డి లోహిత్‌రెడ్డి కేటాయించిన 13ఎకరాల భూమిలో ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించారు. వ్యాపారవేత్తల రామలింగయ్య, బాలింగయ్యల సహకారంతో ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని తిరుపతిలోని పాపనాశనం వద్ద రూపకల్పన చేయించారు. తిరుపతిలో వెలసిన శ్రీవారిలా ఉండడంతో పాటు అక్కడ పూజలు అందుకున్నందుకు పాలెం వెంకన్న దేవాలయానికి రెండో తిరుపతి అనే పేరు వచ్చింది. 1948లో అలువేలు మంగ విగ్రహాన్ని రాయచోటిలో రూపకల్పన చేయించి అమ్మవారి గర్భగుడి నిర్మాణం చేసి అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. దేవాలయం అభివృద్ధితో పాటు దాతల సహకారంతో ముఖమండపం, ధర్మసూత్రాలు, నీటి కొలనులను నిర్మించారు. ఆలయానికి వచ్చిన ఆదాయన్ని గ్రామంలో విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా ఇచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేశారు. 1973లో తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో ఆలయ ఆవరణలో కళ్యాణ మండపాన్ని నిర్మించారు. 1976లో ఆలయాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకుంది.



పాలెం వెంకటేశ్వర స్వామి ఆలయం

## ఎనిమల్ బర్త్ కేర్ సెంటర్ ప్రారంభం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 29 ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రగతి నిధుల ద్వారా రూ.60లక్షల వ్యయంతో నిర్మించిన ఎనిమల్ బర్త్ కేర్ సెంటర్‌ను, నాగర్ కర్నూల్ స్థానిక శాసనసభ్యులు కూచకుళ్ల రాజేష్ రెడ్డి, అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎనిమల్ బర్త్ కేర్ సెంటర్లో వైద్య సేవలలో భాగంగా వీధి కుక్కలను పట్టుకుని జనన నియంత్రణ ఆపరేషన్లు, రేబిస్, పార్వో వైరస్, డిస్టెంపర్ వంటి వ్యాధుల నిరోధక టీకాలు, ఆరోగ్య పరీక్షలు అందించనున్నట్లు, స్టెరిలైజేషన్ (నసబంధి) ఆపరేషన్ చేసి తిరిగి వాటిని వాటి సహజ జీవావరణంలో వదిలే విధానాన్ని అమలు చేస్తారని కలెక్టర్ తెలిపారు. ఇది వీధి కుక్కల పెరుగుదల నియంత్రణతో పాటువాటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేలా ఉంటుందని స్టెరిలైజేషన్ ప్రక్రియ ద్వారా కుక్కల సంఖ్యను నియంత్రించి, వీటి వల్ల ప్రజలకు కలిగే సమస్యలను తగ్గించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ఆపరేషన్ పూర్తయిన కుక్కలను పూర్తిగా ఆరోగ్యంగా మారిన తర్వాత తిరిగి వాటి ప్రాంతాలకు వదిలేస్తారని, ప్రజలకు వీధి కుక్కల ప్రవర్తన, సంరక్షణ, మరియు వీటి జనన నియంత్రణ అవసరాన్ని వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. నాగర్ కర్నూల్ స్థానిక శాసనసభ్యులు కూచకుళ్ల రాజేష్ రెడ్డి, మాట్లాడుతూ పట్టణ ప్రగతి నిధులను ఉపయోగించి వీధి కుక్కల సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, వీధి కుక్కల పెరుగుదల నియంత్రణతో పాటు



ఎనిమల్ బర్త్ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

శునకాల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామాల నుండి వీధి కుక్కలను తీసుకువచ్చి స్టెరిలైజేషన్ నిర్వహించి, పూర్తిగా ఆరోగ్యంగా ఉన్న తర్వాత వాటిని తిరిగి విడిచిపెడతారని తెలిపారు. ఈ కేంద్రం ప్రారంభంతో వీధి కుక్కల నియంత్రణ,శునకాల ఆరోగ్య సంరక్షణ, సాధ్యమవుతుందని భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో ఈకార్యక్రమాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల సహకారంతో శునకాల సంరక్షణ, జనన నియంత్రణ కోసం మరిన్ని నిధులు కేటాయించే ప్రయత్నాలు కొనసాగుతు న్నాయి. వీధి కుక్కల సంఖ్య తగ్గించడంతో పాటు ప్రజలకు సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని శాసనసభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్యశాఖ అధికారి జీవీ రమేష్ ,మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి : కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 29 ప్రతినిధి:** రైతులు తమ పండించిన వేరుశనగ పంటను విక్రయించేందుకు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. రైతులకు మద్దతు ధర తదితర అంశాలపై మార్కెట్ కమిటీ చైర్మన్ల, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో తన ఛాంబర్ నుండి గూగుల్ మీట్ ద్వారా మార్కెట్ కమిటీ చైర్మన్లు, జిల్లా మార్కెట్ శాఖ అధికారి, మార్కెట్ కమిటీ కార్యదర్శులతో వేరుశనగ పంట సేకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వేరుశనగ పంటకు కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.6783 ధర అందేలా చూడాలన్నారు. రైతుల అవసరాలను గుర్తించి అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధికారులు మరింత చురుగ్గా వ్యవహరిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వేరుశనగ సాగు విస్తీర్ణం ఎంత? ఇప్పటివరకు ఎంత మోతాదులో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చారు? ఇంకెంత రావాల్సి ఉంది? అన్న అంశాలపై అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలన్నారు.

## ఫుట్ పాత్ ఆక్రమణ స్వచ్ఛందంగా తొలగించాలి

**వార్డుల్లో అనధికార కట్టడాలను గుర్తించాలి**

**మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ విజయేంద్ర బోయి సమీక్ష**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి29 ప్రభాతవార్త:** మహబూబనగర్ నగర పాలక సంస్థ, మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లతో అర్బన్ డే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫుట్ పాత్‌లు ఆక్రమించిన వారిని స్వచ్ఛందంగా తొలగించాలని లేనియెడలనగర పాలక సంస్థ ద్వారా తొలగించాలని తెలిపారు. రోడ్డు వైపు అక్రమణాలు తొలగించవలసిం దిగా ఆదేశించారు. పట్టణంలో అందరు వారి భద్రత దృష్ట్యా ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించవల సిందిగా అదే విధంగా మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థకు వచ్చే ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేని యెడల అనుమతి నిరాకరించాలని సూచించారు. వార్డ్ ఆఫీసర్‌లు వారి వార్డుల



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

యందు అనధికారిక కట్టడాలను గుర్తించి టౌన్ ప్లానింగ్ విభాగంకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. మహబూబ్ నగర పాలక సంస్థ బోర్డును ఏర్పాటు చేయమని అదేశించారు. మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ మున్సిపాలిటీలలో పారిశుధ్యం పార్కుల సుందరీకరణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,మహబూబ్ నగర్ నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## కొత్త ప్రభుత్వంలో కొత్త మండలంగా ఎర్రవల్లి ఏర్పాటు

**ఇటిక్యాల, జనవరి 29 ప్రభాతవార్త:** ప్రజలకు దగ్గరగా అధికారులు ఉంటూ ప్రజలకు కావలసిన సంక్షేమ పథకాలు వచ్చి అధికారులకు తమ సమస్యలను చెప్పుకునేందుకు గాను గత బిఆర్ఎస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో 15 గ్రామాల ప్రజాప్రతినిధులు ప్రజలు చేసిన పోరాటం వల్ల గత ప్రభుత్వ హయాంలోనే కొత్తగా ఎర్రవల్లి మండలాన్ని ఏర్పాటు చేసిందని అలంపూర్‌ఎమ్మెల్యే విజయుడు అన్నారు. 17 నెలల అనంతరం కొత్తగా ఏర్పడిన ఎర్రవల్లి మండల కేంద్రంలో బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో తాత్కాలికంగా మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేపట్టగా ముఖ్యఅతిథిగా అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు పాల్గొని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు ఇన్చార్జి ఎంపీడీవో అబ్దుల్ సయ్యద్ ఖాన్ తో కలిసి ఎమ్మెల్యే విజయుడు మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ ఏర్పాటు కోసం 15 గ్రామాల ప్రజలకు మండలం అందుబాటులో ఉంటూ ప్రజలు అధికారులకు సమస్యలు చెప్పుకునేందుకు వీలుంటుందని అలాగే నూతన కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వహించేందుకు కొరత లేకుండా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తానన్నారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు మాట్లాడుతూ ప్రజలకు దగ్గరగా ఉండేందుకు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మండలాలు ఏర్పాటు చేసిందని ప్రజలు సంక్షేమ పథకాలు పొందేందుకు కార్యాలయాలకు వచ్చి అధికారులతో సమస్యలు చెప్పుకోవచ్చని అలాగే ప్రభుత్వ పథకాల గురించి కూడా తెలుసుకోవచ్చని పూర్తిస్థాయిలోస్థానిక సంస్థలుఎన్నికలు జరిగిన సమయంలో అన్ని రకాల సంక్షేమ పథకాలు పొందడానికి వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు సింగల్ విండో చైర్మన్ రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి హనుమంత్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, షేక్ పల్లె మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, జోగులాంబ ఆలయ మాజీ చైర్మన్లు బాలకృష్ణారెడ్డి, రవి ప్రకాష్ గౌడ్, సుదర్శన్ రెడి, గజేందర్‌రెడ్డి,నారాయణనాయుడు, కిషోర్, రాగన్న కృష్ణసాగర్, ధర్మారెడ్డి, పరిపూర్ణ, పల్లె రాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఎర్రవల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

## కార్యకర్తలే నాకు ఆత్మీయులు వారే పార్టీకి బలం

**-నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త:** కార్యకర్తలే నాకు ఆత్మీయులని వారే పార్టీకి బలమని, ఏ కార్యకర్తకు కష్టమొచ్చిన 24 గంటలు అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణలతో కలిసి ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు మీ వల్లనే నేను ఇక్కడ మీ ముందు ఎమ్మెల్యేగా ఉన్నానని, ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ఒక్కో సైనికుడిలా పని చేసి నా గెలుపునకు కృషి చేశారని అన్నారు. 30 సంవత్సరాల తర్వాత ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగిరింది అంటే అది మీ వల్లనేనని అన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు ఎన్ని ఇబ్బందులూ పెట్టిన, ఎన్ని కేసులు పెట్టిన మీరు మొక్కవొని విశ్వాసంతో పార్టీ గెలుపునకు కృషి చేశారని, అలాంటి కార్యకర్తల సంక్షేమం, వారి బాగోగుల కోసం,వారి కుటుంబ బాగోగుల కోసం నేను ఎల్లవేళలా పని చేస్తానని అన్నారు. ఏ అర్థరాత్రి అయిన సరే కార్యకర్త ఆపదలో ఉన్నాడంటే వారి కోసం నేను అందుబాటులో ఉన్నాను, ఇక మీదట కూడా ఉంటానని, అలాగే ప్రతి ఒక్క కార్యకర్త కూడా మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వారికి అర్థమయ్యే విధంగా చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు వస్తున్నందున ప్రతి ఒక్కరూ కూడా గ్రామాలలో సమన్వయంతో పని చేసి గ్రూప్ రాజకీయాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళి ఈ సారి కూడా కాంగ్రెస్ జెండా ఎగురవేసి మరోక సారి కాంగ్రెస్ కార్యకర్తల బలంఏంటో చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమణ రావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్ కుమార్, మాజీ జెడ్పీటీసీ కొండా మన్నెమ్మ, మాజీ ఎంపీపీ బండి శాంతమ్మ, నాగర్ కర్నూల్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి

## అధైర్య పడొద్దు అండగా ఉంటా : మాజీ మంత్రి

**పెబ్బేరు జనవరి 29 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలోని సుగూర్ గ్రామం లో పార్టీ కి సంబంధించిన కార్యకర్తలు బోయ బీసన్న, జూదం రాజు అనారోగ్యంతో, రైతు అప్పుల బాధతో మరణించడం జరిగింది. తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఆర్థిక సహాయం చేయడం జరిగింది. పెబ్బేరు పట్టణం కి చెందిన బుచ్చయ్య శెట్టి, ఈ మధ్య కాలంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని వెళ్లి పలకరించడం జరిగింది.

కార్యక్రమం లో మండల అధ్యక్షులు వనం రాములు, వైస్ చైర్మన్ కర్రెస్వామి, నాయకులు పెద్దింటి వెంకటేష్, జగన్నాథం నాయుడు, సాయి, ఎల్లారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ వడ్డె రమేష్, జూదం వెంకటేష్, గోవిందు నాయుడు, మధు, కొండల్, జి పరుశురాం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై మాట తప్పిన రేవంత్

- సుప్రీంకోర్టు తీర్పు వచ్చినా ఎందుకు అమలు చేయడం లేదు
- మాదిగలే రేవంత్ సర్కార్‌ను కూలదోస్తారు
- ఫిబ్రవరి 7న జరిగే వెయ్యి గొంతులు లక్షల డబ్బుల దరువు సభకు లక్షలాదిగా తరలిరండి
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో వేల గొంతులు లక్ష డప్పుల దరువు సన్నాహక సభలో మందకృష్ణ మాదిగ



సన్నాహక సభలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 29 ప్రభాతవార్త:** సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ పై తీర్పు ఇచ్చిన పది నిమిషాల్లోనే నిండు అసెంబ్లీ లో మొదటగా స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ముందుగా తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణను అమలు చేస్తామని చెప్పి నేటి కూడా అమలు చేయకుండా మాట తప్పుతున్నారని ఇప్పటికే రాష్ట్రంలోని పంజాబ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో అమలు అవుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ పై నిర్లక్ష్యం చేస్తున్నారని రాష్ట్రంలో 70 ఉన్న మాదిగలే రేవంత్ సర్కార్ ను కూలదోస్తారని మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని చంద్ర ఫంక్షన్ హాల్లోఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి వెయ్యిల గొంతులు.. లక్ష డప్పుల దరువు సన్నాహక సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడుమందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటగా జడ్చర్ల న్యూ బస్టాండ్ నుండి ర్యాలీగా వచ్చి సిగ్నల్ గడ్డ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు. అక్కడి నుండి ర్యాలీగా డప్పుల దరువు వేస్తూ సభకు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభ ఉద్దేశించి మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన వేల గొంతులు లక్ష డప్పుల దరువు సభతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి చెవులుదద్దరిల్లాలని అందుకు రాష్ట్రంలోని నలుమూలల మాదిగలు తమ పిల్లల భవిష్యత్తుకై డప్పులతో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు వర్గీకరణపై తీర్పు ఇచ్చి ఐదు నెలలు కావస్తున్న ఇప్పటికీ వర్గీకరణ అమలులో రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన నిర్లక్ష్య వైఖరి మూలంగానే ఫిబ్రవరి 7న లక్ష డప్పుల దరువు సభ జరుపుతున్నామని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తామని టిడిపి,కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీలు ఎమ్మార్పీఎస్ ను వాడుకున్నారని కానీఇచ్చిన మాట మీద ఎవరు నిలబడలేక పోయారని ఐదు సంవత్సరాల పాటు అప్పటి టిడిపి ప్రభుత్వం చంద్రబాబు వర్గీకరణ అమలు చేశారని అన్నారు. కానీ ప్రస్తుతం వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరిపై ఘాటుగా స్పందించారు.వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత మొదటగా స్పందించిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణములు తెలంగాణ మొదటి రాష్ట్రంఅవుతుందని గత నోటిఫికేషన్లకు కూడా అమలు చేస్తామని చెప్పింది ఆయనేనని కానీ ఇచ్చిన హామీని మరిచి నియమకాలు చేపట్టారని అన్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ ఆది నుండి మాలల అనుకూల పార్టీని 70 శాతం ఉన్న మాదిగలను కాదని తక్కువ శాతం ఉన్నమాలలకే అధిక ప్రాధాన్యం ఇస్తుందని అందులో భాగంగానే మూడు పార్లమెంట్ రిజర్వేషన్లు కూడా మాలలకే సీట్లు కేటాయించగా మాల కులానికి చెందిన వివేక్ ఒకే కుటుంబానికి మూడు స్థానాలు కేటాయించి మాదిగలను అవమానించారని మండిపడ్డారు కాంగ్రెస్ పార్టీలోఉన్న మాల నాయకులైన ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మల్లురవి వివేక్ కుటుంబం మాటలు విని ఎస్సీ వర్గీకరణ అమలుకు వెనుకడుగు వేస్తుందని విమర్శించారు. రేవంత్‌రెడ్డికు తగిన బుద్ధి చెప్పేందుకే ఫిబ్రవరి 7న హైదరాబాద్ నడిబొడ్డులో వెయిల గొంతులు లక్ష డప్పుల దరువుతో సమాధానం ఇవ్వబోతున్నామని లక్ష డబ్బుల జరుగుతో హైదరాబాద్ఉలిక్కిపడేలా ఉలిక్కిపడేలా చేస్తామని అన్నారు. వర్గీకరణ అమలు చేస్తేనే మాదిగ జాతి బిడ్డల బతుకులు బాగుపడతాయని ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా నిలదొక్కుకుంటారని రేవంత్ రెడ్డి మెడలు వంచి అయినా సరే సుప్రీంకోర్టు వర్గీకరణపై ఇచ్చిన తీర్పునుఅమలు మాదిగ జాతి బిడ్డల కొరకు ఎంతకైనా తెగిస్తామని మందకృష్ణ మాదిగ అన్నారు. ఫిబ్రవరి 7న నిర్వహించే సభకు రాష్ట్ర నలుమూలల నుండి మాదిగలు అధిక సంఖ్యలో హాజరై లక్ష డబ్బుల దరువుతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు టైగర్ జంగయ్య కరాటే శ్రీను, యాదయ్య , జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య,కౌన్సిలర్ శశికిరణ్,రామ్మోహన్, జంగయ్య, యాదయ్య,ఎమ్మార్పీఎస్ నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సంతకం ఫోర్జరీ..!

మొదటి పేజీ తరువాయి భాగం..

తెలిపారు. తర్వాత నారాయణపేటలో అరుణ్ అనే వ్యక్తి వద్ద అతనికి 5000 ఇచ్చి అతని జిరాక్స్ సెంటర్లో నారాయణపేట ఎమ్మెల్యే లెటర్‌ని ఎడిట్ చేసి జిరాక్స్ తీసుకొని దానిమీద ఎమ్మెల్యేసంతకాన్ని ఫోర్జరీ చేసి హైదరాబాదులోని బిసి వెల్ఫేర్ కార్యాలయంలో అందజేశారు.అక్కడ నుండి మరికల్ ప్రిన్సిపాల్‌కు అందేలా ప్లాన్ చేశారు. ఇట్టి విషయం ప్రిన్సిపాల్ ద్వారా ఎమ్మెల్యే ఆఫీస్ కి తెలిపగా అట్టిది నకిలీగా గుర్తించిన ఎమ్మెల్యే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టి శైలేష్, జ్యోతి, సత్తెమ్మ,రాందాస్, అరుణ్ లను నారాయణపేట ఎస్సై వెంకటేశ్వర్లు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని సిఐ శివ శంకర్ తెలిపారు.

## మిర్చి బస్తాలకు నిప్పు

**అయిజ జనవరి 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని లోని తొత్తినోని దొడ్డి గ్రామానికి చెందిన భార్కి భీమన్న అనే రైతు మిర్చి బస్తాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ ఘటనపై బుధవారం మండల తహశీల్దార్ కు రైతు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం తనకున్న3ఎకరముల పొలంలో పండించిన మిర్చి పంటను మార్కెట్‌కు తీసుకువెళ్లేందుకు బస్తాల్లో నింపారు.భోజనం చేసేందుకు ఇంటికివెళ్లి గంట తరువాతవచ్చి చూస్తే బస్తాలకునిప్పంటుకుని మండు తున్నా యనీ వెంటనే మంటలను ఆర్పగా10క్వింటాల్ల మిర్చి కాలిపో యినట్లు రైతు తెలిపారు. తానుఎంతో పెట్టుబడి పెట్టి మిర్చి పంటపండించుకొని మార్కెట్ తీసుకు వెళుతున్న సందర్భంలో అంతలోనే ఈదుర్ఘటనజరగడం దురదృష్టకరమనే ఈ ఘటనకు పాల్పడిన వారిని వెంటనే కనిపెట్టి వారిపై చర్యలు తీసుకొనితమకు న్యాయం చేయాలని తహశీల్దార్ విన్నవించినట్టు తెలిపారు.

## ఆలయంలో ప్రత్యేక పూజలు

**నారాయణపేట టౌన్, జనవరి 29 ప్రభాతవార్త:** మౌని అమావాస్య సందర్భంగా నారాయణపేట పట్టణంలోని నారాయణ స్వామి మఠం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగ పంచామృత అభిషేకం, పుష్పార్చన, కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.